ప్రజాశక్తి

బుధవారం 21 డిసెంబర్ 2022

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఐటిలో వేగం.. ఏదీ మార్గం..

◆ రాష్ట్రంలో రెండు రీసెర్చి సెంటర్లు కలేనా? ◆ ఐటి, ఎలక్ట్రానిక్స్‌లో ఎపిని దాటేసిన ఒడిశా

◆ ఐటి సర్టిఫికేషన్ సెంటర్ వస్తే అన్నీ వచ్చినట్టే: ఐటాప్ రాష్ట్ర అధ్యక్షులు కొసరాజు శ్రీధర్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) రంగ అభివృద్ధికి అపార అవకాశాలున్న కేంద్రం విశాఖనడం అతిశయోక్తి కాదు. ఒక్క మాటలో చెప్పాలంటే రాష్ట్ర విభజన తర్వాత ఐటి కేపిటల్ విశాఖ అన్న ప్రచారం జోరుగా సాగించారు. కానీ పాలకుల ఆర్భాటం తప్ప ఆచరణలో చేసిందేమీ లేదు. దీంతో విశాఖకు ఆ స్థానం నిలుస్తుందా ? ఐటిలో వేగం పుంజుకోగలదా ? అసలు మార్గాన్వేషణ జరుగుతుందా ? అన్న అనుమానాలు కనిపిస్తున్నాయి. ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన బిజెపి నాయకుడు జివిఎల్ నరసింహారావు రాజ్యసభలో విశాఖ ఐటి గురించి కేంద్ర ఐటి శాఖ మంత్రిని ప్రశ్నలతో ఏకరువు పెడుతున్నాడంటూ బిజెపి మీడియా గ్రూపుల్లో ఊదరగొట్టడం చూస్తే... అధికారంలో ఉండి సమాధానం చెప్పాల్సిన రాజ్యసభ సభ్యుడు ప్రశ్నించడం చూస్తే నిజంగా అతిశయమే కదా ?. పక్కనే ఉన్న ఒడిశా రాష్ట్రం ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగంలో ఎపిని ఏనాడో దాటేసింది. ఏదైనా ఒక కొత్త సంస్థ విశాఖకు రావాలంటే సర్టిఫికేషన్ కోసం పూణె పోవాలి. విశాఖకు ఐటి సర్టిఫికేషన్ సెంటర్ ఇప్పించాలంటూ ఐటి ఎపి

కేంద్ర ఐటి శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐటాప్ ప్రతినిధులు (ఫైల్ ఫొటో)

ప్రతినిధులు కొసరాజు శ్రీధర్, నారాయణస్వామి వంటి వారు ఏనాటి నుంచో ప్రభుత్వాలను విశాఖ నుంచి కోరుతున్నారు. ఇవేవీ పట్టకుండా గుక్కతిప్పుకోకుండా ప్రశ్నలడిగేసి గ్రూపుల్లో తోసేసి.. అంతా అయిపోయింది.. త్వరలో విశాఖలో ఐటి వెలగిపోనుందంటూ ప్రచారార్భాటానికి బిజెపి నేతలు తెరతీయడం చూస్తే ఆర్థిక మాంద్యాన్ని కప్పిపెట్టేసి కంపెనీలు వచ్చేస్తాయన్న ప్రచార భ్రమల్లో యువతను ముంచడం బిజెపి నేతలు పనిగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

ప్రపంచ ఐటి రంగంలో సంక్షోభం

ప్రపంచంలో అమెరికా, ఐరోపా వంటి చోట్ల ఐటి దిగ్గజ సంస్థలు తమ సిబ్బందికి భారీ సంఖ్యలో ఉద్వాసన పలకడం మొదలెట్టేశాయి. ఒక వైపు ఉద్యోగాలు పోతుంటే మరోవైపు కొలువుల వేటలో ఉన్న కొత్త ఉద్యోగార్థుల్లో అయోమయం నెలకొంది. అయితే భారత్‌లో పరిస్థితులు ఆశాజనకంగా ఉన్నాయన్న మిగతా 2లో..

లిమ్కా బుక్ రికార్డ్స్ వారు అందజేసిన సర్టిఫికెట్‌ను చూపుతున్న మేయర్, కమిషనర్

లిమ్కా బుక్ రికార్డ్స్‌లో బిగ్ ప్రామిస్

ప్లాస్టిక్ నిషేధంపై 2.45 లక్షల మంది విద్యార్థుల ప్రతిజ్ఞతో సరికొత్త రికార్డు

మీడియా సమావేశంలో జివిఎంసి మేయర్, కమిషనర్ వెల్లడి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్లాస్టిక్ నిషేధంపై విశాఖలో జివిఎంసి అధికారులు ప్రజల సహకారంతో యుద్ధం కొనసాగిస్తూనే ఉన్నారు. అందులో భాగంగా జివిఎంసి ఖాతాలో మరో అవార్డుకు చోటు దక్కింది. రేంజర్ ఫోర్స్ అనే స్వచ్ఛంద సంస్థతో కలిసి ఇటీవల నిర్వహించిన 'బిగ్ ప్రామిస్'కు వరల్డ్ లిమ్కా బుక్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. ఒకేసారి 2.45 లక్షలమందికి పైగా విద్యార్థులతో ప్లాస్టిక్ నిషేధం అమలుపై ప్రతిజ్ఞ చేయించి, నగర వాసుల్లో చైతన్యం తెప్పించినందుకు పెద్ద పురస్కారమే దక్కింది. ఈ మేరకు మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్, వైసిపి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్‌తో కలిసి జివిఎంసి కమిషనర్ జి.రాజాబాబు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ప్రజల సహకారంతోనే తమ కష్టానికి ఫలితం దక్కిందని, భవిష్యత్తులో కూడా ప్లాస్టిక్ నిషేధం అమలుకు మరింతగా ప్రయత్నిస్తామని స్పష్టం చేశారు. ప్లాస్టిక్ నిషేధం అమలు క్రమంలో గతేడాది రూ.4 లక్షల మేర జరిమానా విధించామని, ఈసారి ఇప్పటి వరకు మిగతా 2లో..

భారత నౌకాదళంలోకి 'వగిర్'

▶ వార్త 8లో..

బంగారమ్మపాలెం వద్ద జెట్టీ నిర్మించాలి

▶ వార్త 2లో..

గురుకుల విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

▶ వార్త 6లో..

సంఘటనా స్థలంలో విద్యార్థి మృతదేహంతో ఆందోళనకు దిగిన ఉక్కు ఉద్యోగులు, స్థానికులు

ఫార్మా బస్సుకు విద్యార్థి బలి

◆ స్టీల్ టౌన్‌షిప్‌లో ఘటన

◆ విద్యార్థి మృతదేహంతో 'ఉక్కు' కుటుంబాల ఆందోళన

◆ టౌన్‌షిప్‌లోకి ఫార్మా బస్సులను నిషేధించాలి : సిపిఎం

వార్త 4లో..

కెజిహెచ్‌లో వసతుల కల్పనకు పెద్దపీట

విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రోగుల అవసరాలను తీర్చే కెజిహెచ్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేయాలని, ఆ దిశగా ప్రణాళికలు తయారు చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున వైద్యాధికారులను ఆదేశించారు. కెజిహెచ్, ఆంధ్ర మెడికల్ కాలేజీకి సంబంధించి మౌలిక సమస్యలపై మంగళవారం ఉదయం కెజిహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ప్రధాన వైద్యులు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెజిహెచ్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు ఎంతగానో డబ్బు ఖర్చు చేస్తున్నప్పటికీ అనేక రూపాలలో లోపాలు కనిపిస్తున్నాయని, అందుకోసం గత సమావేశంలో ప్రతి విభాగాధిపతికీ వారి విభాగంలో చిన్న పనుల కోసం లక్ష రూపాయలు మంజూరు చేశామని తెలిపారు. దీనికి సంబంధించి ఏ విభాగాధిపతి ఎంత ఖర్చు చేశారు ? అన్న వివరాలపై సమీక్ష చేశారు. చాలా విభాగాధిపతులు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా ఉన్నారని అసహనం వ్యక్తం చేశారు. ప్రతి విభాగాధిపతీ తమ వార్డుల పరిశుభ్రత, మంచినీరు, లైట్లు, ఫ్యానులు, బెడ్స్, టాయిలెట్స్ వంటి పనులకు ఈ డబ్బు వినియోగించి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని అన్నారు. ఇకనైనా ప్రతి విభాగాధిపతీ ఈ డబ్బును సక్రమంగా వినియోగించి సౌకర్యాలు మెరుగుపరచాలన్నారు. డబ్బులు సరిపోకపోతే ఇంకా మంజూరు చేస్తామని తెలిపారు. ఆసుపత్రిలో అవసరమైన సామగ్రి కొనుగోలుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతానికి అందుబాటులో ఉన్న నిధులను సమృద్ధిగా వినియోగించాలని, ఇతర నిధుల సమీకరణకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రి నిర్వహణకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులను సమకూర్చేందుకు సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో మిగతా 2లో..

మాట్లాడుతున్న విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున

మొదటి పేజీ తరువాయి..

ఐటిలో వేగం.. ఏదీ మార్గం..

విశ్లేషణలూ లేకపోలేదు. ఎందుకంటే ఆయా దేశాల్లో ఉద్వాసనలతో కారుచౌకగా మన నుంచీ మానవ వనరులు లభిస్తాయన్నది ఈ ప్రచార సారాంశంగా ఉంది. అలాంటప్పుడు 'బ్రెయిన్ డ్రెయిన్' ఈ దేశం నుంచి ఉంటుందనే కదా ? ఇక్కడకు కొత్తగా పెట్టుబడితో సంస్థలు వస్తాయా ? ప్రపంచంలో మళ్లీ ఆర్థిక సంక్షోభ ప్రకంపనలు 2023లో వినిపిస్తాయా ? అన్న ఆందోళన అన్ని రంగాల్లోనూ భయంగొలుపుతోంది. ఏదైనా ఒక ఐటి ప్రొడక్ట్‌ను సంస్థ అభివృద్ధి చేస్తే దాని సర్టిఫికేషన్ కోసం అహ్మదాబాద్ లేదా పూణె వెళ్లాలి. ఇలాంటి దానికోసం 2014 నుంచి డిమాండ్ ఉన్నా.. అప్పటి నుంచీ దేశంలో బిజెపి అధికారంలో ఉన్నా ఆ పని ఈ నేతలెవ్వరూ చేయలేదు. విశాఖ, తిరుపతిలో చెరో ఐటి రీసెర్చి సెంటర్ ఏర్పాటు చేస్తానని వాగ్దానం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ఎన్నికల రాగం తీసే దశ వచ్చేసినా సరే ఆ దిశగా ఒక్క అడుగూ వేయలేదు. దేశంలో 10 స్టార్టప్ సిటీల్లో విశాఖ ఒకటిగా ఉందని, ఇక్కడ రూ.40 కోట్ల పెట్టుబడితో హెచ్‌ఎస్‌బిసి పక్కనగల ఖాళీ స్థలంలో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ పార్క్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిపిఐఎల్) ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ కూడా నెరవేరలేదు.

కోవిడ్ తర్వాత దారుల మూత

వాస్తవానికి కోవిడ్ తర్వాత ఐటి రంగంలో చాలా వరకూ దారులు మూసుకుపోయాయి. విశాఖలో ఐటి ప్రమోషన్ ఈవెంట్ - 2022 సాక్షాత్తూ స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేతుల మీదుగా డిసెంబరులో ఉంటుందని అధికార పార్టీ నేతలు గొప్పలు చెప్పినా అది తుస్సుమంది. గడచిన 15 ఏళ్లుగా విశాఖలో సుమారు 120 ఐటి సంస్థలు రుషికొండ, సిరిపురం, సత్యం జంక్షన్, దసపల్లా, విఐపి రోడ్డుల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఇక్కడ నుంచే విదేశీ జాబ్‌వర్క్‌లూ ఈ రంగంలో నడుస్తున్నాయి. గతంలో టిడిపి హయాంలో విశాఖ ఐటి కేపిటల్ అనే ప్రచారాన్ని చేపట్టినా విజయవాడ, మంగళగిరి వైపు కొన్నింటిని వారు కేంద్రీకరించేలా చేశారన్న విమర్శలు లేకపోలేదు. అయినాగానీ విశాఖలో ఐటి ప్రాధాన్యతకు కొదవులేదు. కానీ అనుకున్నంత వేగమూ లేదు. మరో వంద కంపెనీలొచ్చినా సదుపాయాలు కల్పించగలిగే స్థానంలో విశాఖ ఉందని ఐటాప్ రాష్ట్ర అధ్యక్షులు కొసరాజు శ్రీధర్ తాజాగా 'ప్రజాశక్తి'కి తెలిపారు. 'రూ.2500 కోట్లు ఈ సంస్థల నుంచి ఏటా ఆదాయం లభిస్తోంది. కానీ ప్రభుత్వం ఐటి సంస్థలకు విడుదల చేయాల్సిన సుమారు రూ.100 కోట్ల ఇన్సెంటివ్‌లను ఇవ్వడం లేదు' అని ఆయన తెలిపారు.

కెజిహెచ్‌లో వసతుల కల్పనకు పెద్దపీట

అన్ని విభాగాల అధిపతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి చర్యలు చేపట్టాలన్నారు. ఏయే విభాగంలో ఏయే సామగ్రి అవసరమో నివేదికలు తయారు చేసి నిర్ణీత గడువులోగా ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. పత్రికలలో ఆసుపత్రికి సంబంధించి ఎటువంటి ప్రతికూల వార్తలు ప్రచురితమైనా వెనువెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్డియాలజీ, యూరాలజీ, పీడియాట్రిక్, ఆంకాలజీ, న్యూరాలజీ వంటి పలు విభాగాధిపతులు ఆపరేషన్ థియేటర్లు, వార్డులలో కావలసిన సామగ్రి గురించి కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. రూ.10 లక్షలలోపు ఉన్న పనులను తక్షణమే పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఎక్కువ మొత్తం అవసరమయ్యే పనులను ఉన్నత స్థాయికి నివేదించి పరిష్కరిస్తామన్నారు.

సూపరింటెండెంట్‌పై అగ్రహం

గత ఆసుపత్రి అభివృద్ధి సమావేశంలో మంజూరు చేయబడిన పనులు ఇంకా పూర్తికానందున కెజిహెచ్ సూపరిండెండెంట్‌పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్‌కు సంబంధించి ఎటువంటి సమస్యనైనా తక్షణమే పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎపి ట్రాన్స్‌కో ఎస్‌ఇని ఆదేశించారు. వార్డులలో పేషెంట్స్‌కు ఇచ్చే భోజనం సరిగాలేదని విభాగాధిపతులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వెంటనే సంబంధిత కాంట్రాక్టర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. వైద్యులందరూ పూర్తిస్థాయిలో సమయ పాలన పాటిస్తూ ప్రజలకు సేవ చేయాలని కోరారు. కార్యక్రమంలో కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.మైథిలి, ఆంధ్ర మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ బుచ్చిరాజు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ జ్ఞాన సుందరరాజు, డిఎం అండ్ హెచ్‌ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు పాల్గొన్నారు.

లిమ్కా బుక్ రికార్డ్స్‌లో బిగ్ ప్రామిస్

ఆ మొత్తం రూ.9 లక్షలు దాటిందని అన్నారు. మరోవైపు స్వచ్ఛంద సంస్థలు, కళాకారులు, అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో విశాఖలో నిత్యం సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధంపై చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. ఇప్పటికే ప్లాస్టిక్ తయారీదారులతో సమావేశం నిర్వహించామని తెలిపారు. వ్యాపారులు నష్టపోకుండా గుడ్డ సంచుల యంత్రాలు సమకూర్చుకునేందుకు అవకాశమున్నంత మేరకు జివిఎంసి కూడా సహకరిస్తోందన్నారు.

సిఎం జగన్ సహకారంతో ఈ పురస్కారం దక్కించుకున్నామని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలుకు ప్రజలు ముందుకు రావాలని, ఆలిండియా స్థాయిలో వివిధ విద్యా సంస్థల సహకారంతో సురభి క్లినిక్స్, హెచ్‌సిజి కేన్సర్ ఆసుపత్రి, సింహాద్రి టిఎంటి, రేంజర్ ఫోర్స్ సంస్థల చొరవతో లిమ్కా బుక్స్‌లో జివిఎంసి చోటు సంపాదించుకోగలిగిందని అన్నారు. డిప్యూటీ మేయర్ శ్రీధర్ మాట్లాడుతూ అందరి భాగస్వామ్యంతో విశాఖ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచగలుగుతున్నామన్నారు. మరో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ మాట్లాడుతూ జనవరి 26 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ నిషేధం అమలు కానుందని, సిఎం జగన్ కూడా ఆ ఆశయం మేరకు పనిచేస్తున్నారని గుర్తు చేశారు. ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ నగరం అన్ని రంగాల్లోనూ ముందుకు పోతోందని, ఈ లిమ్కా పురస్కారం కూడా ప్రజల సహకారంతోనే సాధించగలిగామని అన్నారు. అనంతరం లిమ్కా బుక్‌లో చోటు దక్కేందుకు సహకరించిన సింహాద్రి టిఎంటి తరపున సృజనా బాబుకు, సురభి క్లినిక్స్ తరపున డాక్టర్ జివిఎంసి రావు, రేంజర్ ఫోర్స్ తరపున నాగేంద్ర కుమార్, హెచ్‌సిజి కేన్సర్ ఆస్పత్రి తరపున గొంప సురేష్‌ను అభినందించారు.

బంగారమ్మపాలెం వద్ద జెట్టీ నిర్మించాలి

- ఎన్‌ఎఓబి నిర్వాసితులను ఆదుకోవాలి - మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత డిమాండ్

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న అనిత

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఎన్‌ఎఓబి నిర్వాసితుల కోసం బంగారమ్మపాలెంలో తక్షణం జెట్టీ నిర్మించి ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత అన్నారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ డిమాండ్లను నెరవేర్చుకునేందుకు ఎన్‌ఎఓబి నిర్వాసితులు 50 రోజులుగా ఆందోళన చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు స్పందించకపోవడం శోచనీయమని తెలిపారు. జెట్టీ నిర్మాణం జరిగే వరకూ మత్స్యకారులను సముద్రంలోకి వేటకు అనుమతించాలన్నారు. సముద్రపు ఒడ్డు నుంచి హార్బర్ నిర్మించాలన్నారు. హార్బర్ సమీపంలోనే మత్స్యకారులకు పునరావాస కాలనీ ఏర్పాటు చేయాలని కోరారు. హార్బర్ నిర్మాణం జరిగే వరకూ శారద, వరాహ నదులలో చేపల వేటకు ఆటంకం పరచరాదన్నారు. శారదా ముఖద్వారం గుండా సముద్రంలోకి మత్స్యకారులు వెళ్లి చేపలవేట చేసుకోవడానికి అవకాశం కల్పించాలన్నారు. నేవీలో 50 శాతం ఉద్యోగాలను నిర్వాసితులైన మత్స్యకార కుటుంబాలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బంగారమ్మ పాలెం మత్స్యకార సొసైటీకి చెందిన 116 ఎకరాల భూమికి ప్రస్తుతం ఉన్న రేటు ప్రకారం పరిహారం చెల్లించాలన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు కేంద్రీయ విద్యాలయాన్ని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టిడిపి బంగారమ్మపాలెం గ్రామ అధ్యక్షులు కారే కష్ణ, కార్యదర్శి కోడె బంగార్రాజు, బొంది బంగార్రాజు, మైలపల్లి సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇప్పుడు ఎన్నికలు పెడితే
వైసిపికి 50 సీట్లు కూడా రావు

రాష్ట్రంలో ఇప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే అధికార వైసిపికి 50 సీట్లు కూడా రావని అనిత అన్నారు.

మీడియా సమావేశం సందర్భంగా ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు ఆమె బదులిస్తూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని తెలిపారు. జగన్ పాలన పట్ల అన్ని తరగతుల ప్రజలూ తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు.

ఘనంగా ద్రోణంరాజు సత్యనారాయణ జయంతి

ద్రోణంరాజు విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కీర్తిశేషులు ద్రోణంరాజు సత్యనారాయణ 90వ జయంతి వేడుకలు సిరిపురంలోని ద్రోణంరాజు సర్కిల్ వద్ద ఘనంగా జరిగాయి. వైసిపి నేత ద్రోణంరాజు శ్రీవత్సవ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో పలువురు ప్రముఖులు మాట్లాడుతూ ద్రోణంరాజు సత్యనారాయణతో తమకున్న అనుభవాలను నెమరువేసుకున్నారు. ద్రోణంరాజు కుటుంబం యూనివర్సిటీ వంటిదని, ఎంతోమందిని రాజకీయ నాయకులుగా తీర్చిదిద్దిన ఘనత ఆయనదని అన్నారు. నేడు ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా, నాయకులుగా చెలామణీ అవుతున్న ఎంతోమంది ఆయన శిష్యులేనన్నారు. కరోనా కారణంగా అకాల మరణం చెందిన ఆయన కుమారుడు ద్రోణంరాజు శ్రీనివాస్ నిబద్ధత కలిగిన నేతగా గుర్తింపు పొందారన్నారు. నేడు శ్రీవత్సవ అటువంటి లక్షణాలే కలిగి ఉన్నాడని కొనియాడారు. ద్రోణంరాజు కుటుంబానికి తామంతా తోడుగా ఉంటామన్నారు. ద్రోణంరాజు శ్రీవత్సవ మాట్లాడుతూ తన తాత సత్యనారాయణ దేశ రాజకీయాలను శాసించే వారని, ముఖ్యంగా ఉత్తరాంధ్ర టైగర్‌గా పేరు తెచ్చుకున్నారని, తన తండ్రి ద్రోణంరాజు శ్రీనివాస్ రాజకీయ రంగంలో మచ్చలేని నేతగా గుర్తింపు పొందారని, వారి అడుగుజాడల్లో నడుస్తానని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తమ కుటుంబం మీద ఎంతో ప్రేమ, అభిమానం చూపిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ హరి వెంకట కుమారి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాస్, వాసుపల్లి గణేష్ కుమార్, అదీప్ రాజు, వైసిపి జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబు, జియ్యాని శ్రీధర్, యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, ప్రసన్నకుమార్, కెవి.రామ్మూర్తి, తైనాల విజయ్ కుమార్, సీతంరాజు సుధాకర్ పాల్గొన్నారు.

22న గిరి విజ్ఞాన సంబరాలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఈనెల 22న జోనల్ స్థాయి గిరి విజ్ఞాన సంబరాలు నిర్వహించాలని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆదేశించారు. జోనల్ స్థాయి గిరి విజ్ఞాన సంబరాలు పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల మండలాలకు చెందిన విద్యార్థ్యులు పాడేరు తలారిసింగి ఆశ్రమ పాఠశాలలోను, పెదబయలు, ముంచింగిపుట్టు మండలాల విద్యార్థులు పెదబయలు బాలురు -1 ఆశ్రమ పాఠశాలలోను, డుంబ్రిగుడ, అనంతగిరి, అరకువ్యాలీ మండలాల విద్యార్థులు అరకు వ్యాలీ రవ్వలగుడ ఆశ్రమ పాఠశాలలోను, చింతపల్లి, జి.కె. వీధి, కొయ్యూరు మండలాల విద్యార్థులు చింతపల్లి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల -1 లోను నిర్వహించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసారు. ఈనెల 28, 29, 30 తేదీలలో ఐటిడిఎ స్థాయి గిరిజన విజ్ఞాన సంబరాలను స్థానిక తలారిసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో నిర్వహిస్తారని వెల్లడించారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

పాడేరు: రాష్ట్రంలోని కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తానని ఎన్నికల ముందు పాదయాత్రలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బేబీ రాణి డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లా సిఐటియు ప్రథమ మహాసభలకు హాజరైన సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక సమస్యల్ని విస్మరించి, కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచిపెట్టె పనిలో ఉన్నాయని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులోని రూ.1200 కోట్లను కార్మికుల సంక్షేమానికి వినియోగించాలని డిమాండ్ చేశారు.

వ్యర్థాలపై కదిలిన యంత్రాంగం

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

మురుగునీటి ప్రవేశ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న లొడగల రామ్మోహన్ తదితరులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : సాగర్ నగర్‌లో 'సన్ సినోరా' సంస్థ వదిలిన వ్యర్థాలపై 'ప్రజాశక్తి'లో ఈ నెల 19న ప్రచురితమైన కథనంపై జివిఎంసి, సచివాలయ, ఇంజినీరింగ్ అధికారులు స్పందించారు. మంగళవారం ఉదయం ఈ సంస్థ ఉన్న ప్రదేశానికి స్థానిక కార్పొరేటర్ లొడగల అప్పారావు తనయుడు లొడగల రామ్మోహన్‌తో కలసి వచ్చి ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ ప్రాంతంలో మరుగు నీరు ప్రవహించే ఏరియాను రెండు గంటల పాటు వారు ప్రత్యక్షంగా చూశారు. స్థానికులు జివిఎంసి డిఇ వంశీకృష్ణకు పరిస్థితిని వివరించారు. ఈ మేరకు ఆయన స్పందిస్తూ అటు స్థానిక ప్రజలకు, ఇటు సన్ యాజమాన్యానికి నష్టం కలుగకుండా సరైన ప్రణాళికతో సమస్యకు పరిష్కారం చూపుతామని వెల్లడించారు. త్వరలోనే అందరితో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

'అవంతి' స్నాతకోత్సవంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

స్నాతకోత్సవ సభలో మాట్లాడుతున్న వెంకయ్య నాయుడు

ప్రజాశక్తి- తగరపువలస : ప్రస్తుతం చదువుకునేందుకు ఉన్న అపారమైన అవకాశాలను అందిపుచ్చుకోవాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు విద్యార్థులకు సూచించారు. స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో అవంతి విద్యా సంస్థల్లో 2021-22 ఏడాదిలో వివిధ కోర్సులు పూర్తి చేసి పట్టభద్రులైన సుమారు 1200 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను, ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన సుమారు 60 మంది విద్యార్థులకు బంగారు, వెండి పతకాలను బుధవారం జరిగిన స్నాతకోత్సవ సభలో వెంకయ్య నాయుడు, రాజ్య సభ మాజీ సభ్యులు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని, భారతీయ సంస్కృతి సంప్రదాయాలతో జోడించి విద్యను అభ్యసించాలని సూచించారు. నిజాయతీ, నిబద్ధతతో ఉంటే రంగం ఏదైనా రాణించవచ్చని తెలిపారు.

కులం, ధనం కంటే గుణం గొప్పది

కులం, ధనం కంటే గుణం గొప్పదని వెంకయ్యనాయుడు అన్నారు. గూగుల్ కంటే గురువు గొప్ప అని స్పష్టం చేశారు. ఎంతకాలం బతికామనేది ప్రాధాన్యం కాదని, ఉన్నంత కాలం సమాజానికి ఏ మేరకు మేలు చేసామనేది ముఖ్యమని అన్నారు. గతంలో రాజకీయాల్లో వ్యక్తిత్వం, నిబద్ధత, నిజాయతీ ఉండేవని, నేడు కులం, ధనం, నేర చరిత్ర అర్హతలు గా ఉండడం దురదృష్టమని వాపోయారు.

మాతభాషను మరువద్దు

మాతృభాషను ఎట్టి పరిస్థితుల్లోనూ మరువద్దని విద్యార్థులకు నొక్కి చెప్పారు. తెలుగు భాష, తెలుగు జాతి ఔ న్నత్యాన్ని ఇనుమడింప జేయాలన్నారు. చేపలను పట్టే విధానం నేర్పాలి తప్పితే, వాటిని పట్టి ఇవ్వడం వల్ల ఉపయోగం ఉండదని పేర్కొంటూనే పరోక్షంగా రాష్ట్రంలో అమలులో ఉన్న సంక్షేమ పథకాలపై వ్యంగ్యో క్తులు విసిరారు. ఉచిత పథకాలు ఇవ్వ కూడదని చెప్పట్లేదు, అదే సందర్భంలో నిరుద్యోగ యువతకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి శాశ్వత ఉపాధి కల్పిస్తే ఉపయోగమన్నారు. గతంలో గనులు దోచుకున్న వారుంటే, నేడు జీవ నదులు సైతం ఆక్రమణకు గురవుతున్న ట్లు వాపోయారు.

ఐదు వేల ఏళ్ల ఉన్న మన భారతీయ సంస్కృతి ఎంతో గొప్పదని గౌరవ అతిథిగా హాజరైన రాజ్య సభ మాజీ సభ్యులు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. ఎంచుకున్న లక్ష్యం ఉన్నతంగా ఉండాలని అవంతి విద్యా సంస్థల అధినేత, స్థానిక ఎమ్మెల్యే ము త్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జెఎన్‌టియు, ఉపకులపతి ప్రొఫెసర్ జివిఆర్ ప్రసాద రాజు, అవంతి ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ ఎం.ప్రియాంక, జాయింట్ సెక్రటరీ ఎంఎస్ నందీష్, అవంతి విద్యాసంస్థల ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చెరువులో పడి వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని బాకురుపాలెం గ్రామంలో చెరువులో పడి వృద్ధురాలు మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి ఆనందపురం మండలం గిడిజాల గ్రామానికి చెందిన రేవిడి కనకమ్మ (77) మతిస్థిమితం లేక ఇంటి నుండి బయలుదేరి బాకురుపాలెం వైపు వచ్చింది. బహిర్భూమి నిమిత్తం బాకురపాలెం చెరువుకు వెళ్లి కాలుజారి పడిపోవడంతో నీరు తాగి మృతి చెందింది. కుమార్తె సవరవిల్లి పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

ఆటల పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి- భీమునిపట్నం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన భీమిలి మండలం, దాకమర్రిలో ఇటీవల జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో 17 ఏళ్ల లోపు బాలుర విభాగంలో తమ స్కూల్ కు చెందిన 9వ తరగతి విద్యార్థి కె విక్రాంత్‌కౌల్ ప్రతిభ కనబరిచారని, ఆంధ్రా యూనివర్సిటీలో జిల్లా స్థాయి లో ఇటీవల జరిగిన యోగా పోటీల్లో తమ స్కూల్ కు చెందిన 10వ తరగతి విద్యార్థి ఎస్.భార్గవి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ డైరెక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. వీరిద్దరితో పాటు, పిఇటిలను ఆయన అభినందించారు.

దంత వైద్యంపై అవగాహన

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సంగివలస అనిల్ నీరుకొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్‌లో బుధవారం దంత వైద్యం, రేడియాలజీ రంగంలో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ఉపయోగంపై గుంటూరుకు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ వై.సమత పలు అంశాలపై వైద్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ డాక్టర్ వంశీకృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ అనిల్, ఒరల్ మెడిసిన్ అండ్ రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ బి రామకృష్ణ పాల్గొన్నారు.

గీతంలో క్రిస్మస్ వేడుక

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో క్రిస్మస్ ముందస్తు వేడుకలను మంగళవారం ఘనంగా నినిర్వహించారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. యువతరం అన్ని మతాలలోని మంచిని గ్రహించి జీవితాన్ని ఉన్నతంగా మలచుకోవాలని పిలుపునిచ్చారు. భారతదేశం విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలు, మతాలకు నిలయం అని, పరమత సహనం, సమైఖ్య భావన ప్రజలను ఏకతాటిపై నిలుపుతుందన్నారు. సమాజంలోని అందరిపట్ల దయతో, ప్రేమతో వ్యవహరించాలని, మంచిని పెంచాలని క్రీస్తు సందేశాన్ని క్రిస్మస్ పండుగ తెలియజేస్తుదన్నారు.

సిసి రోడ్డు నిర్మాణం చేపట్టరూ..

ప్రజాశక్తి -పిఎం పాలెం : జివిఎంసి 5వ వార్డు పర్యటనలో ఉన్న కమిషనర్ రాజాబాబును కొమ్మాదిలో ఉన్న స్వయంకృషినగర్ వాసులు, సిపిఎం నాయకులు డి.అప్పలరాజు, పి.రాజుకుమార్, టికె.శారద కలిశారు. స్వయంకృషినగర్‌లో రహదారి ఆక్రమణ విషయాన్ని వివరించారు. కమిషనర్ రహదారి ఆక్రమణ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా 11సంవత్సరాలుగా ఈ సమస్యతో ఇక్కడి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఒకే కుటుంబం సుమారు ఆరు వందల గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారని, చివరకు 12అడుగుల రహదారిని కూడా ఆక్రమించి 100 కుటుంబాలను ఇబ్బంది పెడుతున్నారని వివరించారు. ఆక్రమణ దారునిపై చర్యలు తీసుకోవాలని, రహదారి స్థలాన్ని స్వాధీనం చేసుకొని రోడ్డు నిర్మాణం చేపట్టాలని సిపిఎం జోన్ కార్యదర్శి డి.అప్పలరాజు కోరారు.

వెలగపూడి దృష్టికి 'ఇదేం ఖర్మ' సమస్యలు

ప్రజాశక్తి - ఆరిలోవ : 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా 9వ వార్డులో సమస్యలపై వచ్చిన సర్వే పత్రాలను వార్డు టిడిపి ఇన్‌ఛార్జి బుడుమూరు గోవిందు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు అందజేసారు. టిడిపి నాయకులు బాదరు బాలరాజు, ఒమ్మి పోలారావు తదితరులు వినతులు అందజేసిన వారిలో ఉన్నారు.

త్వరలో బిహెచ్‌పివి గుర్తింపు సంఘం ఎన్నికలు

ప్రజాశక్తి- గాజువాక : బిహెచ్‌పివిలో త్వరలో గుర్తింపు సంఘ ఎన్నికలు జరగనున్నాయి. దీనికి సంబంధించిన అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వెంటనే ఎన్నికలు నిర్వహించాలని, కాలయాపన చేయరాదని కోరారు. కార్మికుల హక్కులను హరించకుండా యాజమాన్యం ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని కోరారు.

ఆరో వార్డులో క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి-పిఎం పాలెం : జివిఎంసి 6వ వార్డు కొమ్మది సమీపంలో వైసిపి నాయకులు గుంటుబోయిన సంజీవ్ యాదవ్ ఆధ్వర్యంలో క్రీకెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీకెట్ టోర్నమెంట్ లో 5వ వార్డు జట్టు గెలుపొందాగా, 6 వ వార్డు జట్టు రన్నర్స్ గా నిలిచారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జి వి ఎం సి చీఫ్ విప్, 6వ వార్డ్ కార్పొరేటర్ డాక్టర్ ముత్తంశెట్టి ప్రియాంక విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి - ఆరిలోవ : విద్యుత్ లైన్లు సరిచేసే కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, బిఆర్‌ఆర్ నగర్, తోటగరువు, హనుమంతువాకకొండ, కైలాసగరి రోడ్డు పరిసర ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనున్నట్టు ఎపిఇపిడిసిఎల్ ఏఈ ఎస్.శ్వేత ఒక ప్రకటనలో తెలిపారు.

ఇందన పొదుపు ర్యాలీ

ప్రజాశక్తి -పిఎం పాలెం : జోన్ 3 విద్యుత్ శాఖ ఎక్జిక్యూటివ్ ఇంజినీర్ పొలకి శ్రీనివాస్ ఆదేశాలు మేరకు ఇంధన పొదుపు వారోత్సవాలు ర్యాలీని పిఎం.పాలెం ఎలక్ట్రికల్ ఎఇ డి.నరేష్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా పిఎం.పాలెం సమీపంలో ఉన్న సృజన స్కూల్‌లో విద్యార్థులకు విద్యుత్ పొదుపు పట్ల అవగాహన కల్పించారు. ఎఇ డి.నరేష్ మాట్లాడుతూ, భావితరాలకు ఇంధన వనరులు అందివ్వాలన్నారు. సౌరశక్తితో పనిచేసే గృహోపకరణాలు, వాహనాలు, ఎల్‌ఇడి బల్బులు, ఐఎస్ఐ మార్కు కలిగిన విద్యుత్ ఉపకరణాల వాడకం, సరియైన వెంటిలేషన్‌తో గృహ నిర్మాణం చేపట్టడం ద్వారా విద్యుత్‌ను ఆదాచేయవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో పి ఎం పాలెం సబ్ స్టేషన్ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

వార్డుల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

ప్రజాశక్తి-మధురవాడ : వార్డుల్లో మౌలిక వసతులు కల్పిస్తామని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు తెలిపారు. ఐదో వార్డు పరిధి కొమ్మాది, అయ్యప్పనగర్, వివేక నగర్‌కాలనీ, సాయిరాం కాలనీ, బొట్లవానిపాలెం తదితర ప్రాంతాలలో వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలతతో కలిసి కమిషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, స్థానిక ప్రజల విన్నపం మేరకు ఇందిరానగర్ కాలనీలోని శ్మశాన వాటిక అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. తాగునీరు, నడక మార్గం, షెడ్డు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తామని చెప్పారు. అయ్యప్ప నగర్‌లో గెడ్డలకు రక్షణ గోడల నిర్మాణం, తాగునీటి సమస్య ఉందని, ఇందిరానగర్‌లో శిథిలావస్థలో ఉన్న రోడ్లు కాలువలను పునర్మించాలని, సాయిరాం కాలనీలో రక్షణ గోడల నిర్మాణం, రోడ్లు, తాగు నీటి ట్యాంక్ నిర్మాణం చేయాలని, రాజీవ్ గృహకల్ప కాలనీలో కాలువలు శిథిలావస్థలో ఉన్నాయని, తాగునీటి పైప్ లైన్లు మార్చాలని, బొట్టవానిపాలెంలో చెరువు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని స్థానిక కార్పొరేటర్ కోరారని, వాటిపై వార్డు అభివృద్ధి ప్రణాళికలో చేర్చి అంచలంచెలుగా అభివృద్ధి చేస్తామన్నారు. అయ్యప్పనగర్‌లో మరో రెండు నెలల్లో తాగునీటి సమస్యను తీర్చేందుకు చర్యలు చేపట్టమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకుడు మొల్లి లక్ష్మణరావు, ప్రధాన వైద్యాధికారి శాస్త్రి, జోన్ కమిషనర్ రాము, ఎఎంఒహెచ్ కిషోర్, మత్యరాజు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల నాటివేత

ప్రజాశక్తి-యంత్రాంగం

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో భాగంగా మంగళవారం విశాఖలో పలు చోట్ల మొక్కలు నాటే కార్యక్రమాలను చేపట్టారు.

పిఎం పాలెం : 7వ వార్డు వైసిపి అధ్యక్షులు శ్రీనివాసరావు ఆధ్వర్యాన ద్రోణంరాజు సత్యనారాయణ కల్యాణ మండపం ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, మహిళా అధ్యక్షులు చేకూరి రజని, వైసిపి నాయకులు పిళ్లా సూరిబాబు, కుడితి రామారావు, జగుపిల్లి నరేష్ పాల్గొన్నారు.

కరాస : 52వ వార్డు శాంతినగర్ పార్కులో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వెదుళ్ల శ్రీను, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ బిఎస్.కృష్ణ (ఆల్ఫా కష్ణ), గొంతిన రామకృష్ణ, వెంకటరావు, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు పెనుమత్స శ్రీదేవి వర్మ , జోష్న, సఖి, మునగపాక సత్యవతి పాల్గొన్నారు .

భీమునిపట్నం : స్థానిక పెద బజారులో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మాజీ మంత్రి బాలరాజుతో కలిసి మొక్క నాటారు. అనంతరం స్థానిక వాసవి కల్యాణ మండపంలో అభివద్ధి, సంక్షేమంపై పట్టణ ప్రముఖులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి నాల్గో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, వైసిపి నాయకులు కె.ఎల్లాజి, సిహెచ్ గౌరినాయుడు, మధునాయుడు, తది తరులు పాల్గొన్నారు.

చిట్టి వలస ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రాము నాయుడు మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు జగుపిళ్ల ప్రసాద్, తమ్మిన రామ లక్ష్మణ రావు, ఉప్పాడ నాగేశ్వర రావు, పందిరి విజయ్, శివ రామకృష్ణ, చిన బాబు, ఎస్ ప్రసన్న, తమ్మి న అశోక్ తది తరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత ఆధ్వర్యంలో ఆరిలోవ కాలనీ, అప్పర్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. విఎంఆర్‌డిఎ చైర్మన్, తూర్పు వైసిపి సమన్వయకర్త అక్కరమాని విజయ నిర్మల పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కెల్ల సత్యనారాయణ, పిల్లి వీర్రాజు, వెంకటరెడ్డి, కాకర గోవిందు, వంకర బాబూరావు, పాండ్రంకి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం : 57వ వార్డు గ్రామ సచివాలయ పరిధిలో కార్పొరేటర్ ముర్రువాని నానాజీ ఆధ్వర్యాన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సిబ్బంది, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

సీతమ్మధార : 14 వార్డు పరిధిలోని స్నేపర్ పార్క్‌లో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబుతో కలిసి కలెక్టర్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కెకె.రాజు, అనీల్ కుమార్ రాజు, పంచకర్ల రమేష్‌బాబు, నాయకులు కాశీ విశ్వనాథం, చొక్కాకుల లక్ష్మీ వెంకటరావు, సీతంరాజు సుధాకర్ పాల్గొన్నారు.

ఫార్మా బస్సుకు విద్యార్థి బలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌లోని డిపాల్ స్కూల్లో చదువుతున్న ఏడేళ్ల బాలుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మంగళవారం ఉదయం తల్లితో పాటు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సమయంలో ఇందిరా పార్క్ సమీపంలో యూటర్న్ తీసుకుంటుండగా ఫార్మా బస్సు ఢీకొంది. ఈ ఘటనలో ఎలిజ (9) తలపై నుంచి ఫార్మా కంపెనీకి చెందిన బస్సు చక్రాలు వెళ్లడంలో తల నుజ్జయి అక్కడికక్కడే బాలుడు మృతి చెందాడు. బాలుడి తాత చిట్టిబాబు స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్ విభాగంలో పనిచేసి విరమణ పొందారు. బాలుడి తండ్రి అమెరికాలో ఉంటున్నారు. అగనంపూడి అభిరామి అపార్ట్‌మెంట్స్‌లో నివాసం ఏర్పాటు చేసుకుని ప్రతిరోజు పాఠశాలకు ద్విచక్ర వాహనంపై తల్లి తీసుకువెళ్లి వస్తుంటారు. ఉక్కునగరం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు వివరాలను నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

బాలుని మృతదేహంతో ధర్నా

ఫార్మా కంపెనీ బస్సులను ఈ రహదారిలో నిషేధించాలని గత కొంతకాలంగా పాఠశాల యాజమాన్యాలకు వినతి పత్రాలు సమర్పించినప్పటికీ ఎవరూ పట్టించుకోవడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు రాస్తారోకో చేపట్టారు. బాలుని మృతదేహంతో పిల్లల తల్లిదండ్రులు, ఉక్కు ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. కేవలం టోల్‌చార్జీ ఎగ్గొట్టడానికి ఫార్మా బస్సులను ఉక్కునగరం వైపు మళ్లిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థి మతి చెందిన సందర్భంగా పాఠశాలకు యాజమాన్యం సెలవు ప్రకటించింది. ఉదయం 7 గంటల నుంచి 9:00 వరకు విపరీతమైన రద్దీ ఉండే ఈ ప్రాంతంలో కనీసం ఒక్క ట్రాఫిక్ పోలీసును కూడా ఏర్పాటు చేయకపోవడంపై ఉక్కు ఉద్యోగులు విమర్శలు చేస్తున్నారు. అటు యాజమాన్యం కానీ ఇటు ట్రాఫిక్ పోలీసులు కానీ పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

స్టీల్ టౌన్‌షిప్‌లోకి ఫార్మా బస్సులను నిషేధించాలి : సిపిఎం

ప్రజాశక్తి - విశాఖపట్నం : స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోకి ఫార్మా కంపెనీల బస్సుల ప్రవేశాన్ని నిషేధించాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎఆర్ లైఫ్ సైన్స్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన ఫార్మా బస్సు మంగళవారం స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో డి.పాల్ స్కూల్‌కు చెందిన నాలుగో తరగతి విద్యార్థి ఆలీజ (9)ను బలి తీసుకుందని తెలిపారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాలుని మృతికి కారణమైన ఎఆర్ లైఫ్‌సైన్స్ యాజమాన్యంపై పోలీసులు క్రిమినల్ కేసులు పెట్టి, తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మృతుని కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. స్కూలు సమయంలో ఈ మార్గంలో ప్రైవేటు బస్సుల ప్రవేశాన్ని నిరాకరిస్తూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసినా, బస్సులు యధేచ్ఛగా తిరుగుతూ పిల్లలను బలి తీసుకుంటున్నాయని తెలిపారు.

ఆర్ లైఫ్ సైన్స్ యాజమాన్యంపై క్రిమినల్ కేసు పెట్టాలి : గంగారావు

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఉక్కునగరం రోడ్డులో 3వ తరగతి విద్యార్థి మృతికి కారణమైన ఆర్ లైఫ్ సైన్స్ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టాలని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి గంగారావు డిమాండ్ చేశారు. చనిపోయిన విద్యార్థి కుటుంబానికి ఆయన ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. స్టీల్ యాజమాన్యం స్కూల్ సమయంలో ప్రైవేట్ వాహనాలకు ఆ మార్గం గుండా అనుమతులు లేనప్పటికీ వారు ఆ మార్గంలోనే ప్రయాణించడం ద్వారా ప్రమాదం సంభవించిందన్నారు. స్టీల్ యాజమాన్యం స్పందించి సర్క్యులర్లను ఇవ్వడంతో చేతులు దులుపుకోకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వమే దగ్గర ఉండి బాధిత కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

రైల్వే స్టేషన్ కార్మికులకు జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి -కంచరపాలెం : విశాఖ రైల్వే స్టేషన్‌లో ఎ1 ఫెసిలిటీస్ సంస్థ తరుపున పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు లేబర్ యాక్ట్ ప్రకారం రోజుకు రూ.595 కనీస వేతనంగా చెల్లించాలని, ఇప్పటివరకు బకాయి పడ్డ జీతాలను ఈ విధంగానే తక్షణం చెల్లించాలని రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జనరల్ సెక్రటరీ ఒ.అప్పారావు, గౌరవాధ్యక్షులు బి.జగన్ డిమాండ్ చేశారు. రైల్వే స్టేషన్లో కార్మికులు మంగళవారం పని నిలుపుదల చేసి నిరసన తెలిపారు. పిఎఫ్, ఇఎస్ఐ చట్టబద్ధంగా అమలు చేయాలని, ప్రతినెలా 10వ తేదీలోగా జీతాలు వేయాలని, రైల్వే అధికారులు కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకొని కార్మిక చట్టాలను కచ్చితంగా అమలు చేయించాలని డిమాండ్ చేశారు.

కమ్యూనిటీ సర్వీసు ప్రాజెక్టు కీలకం

ప్రజాశక్తి -ములగాడ : నూతన విద్యా విధానంలో కమ్యూనిటీ సర్వీసు ప్రాజెక్టు అత్యంత కీలకమైనదని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్ భాగ్యలక్ష్మి అన్నారు. నగరంలోని గాయత్రీ విద్యా పరిషత్ డిగ్రీ, పీజీ కళాశాలలో అధ్యాపకులను, విద్యార్థులను ఉద్దేశించి కమ్యూనిటీ సర్వీసు ప్రాజెక్టుపై ఆమె ప్రసంగించారు. విద్యార్థి తన చుట్టూ ఉన్న సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నా, సమాజంలోని సమస్యలను అర్థం చేసుకోవాలన్నా, సామాజిక సమస్యలకు పరిష్కారాలు రూపొందించాలన్నా కమ్యూనిటీ సర్వీసు ప్రాజెక్టులో పనిచేయడం అత్యంత అవసరమని అన్నారు. ప్రతి విద్యార్థీ ఆరు వారాలపాటు కమ్యూనిటీ సర్వీసులో ఉండాలని చెప్పారు. సీనియర్ ప్రోగ్రాం అధికారి వై. అనసూయాదేవి మాట్లాడుతూ, సర్వేకు సంబంధించి సామాజిక సమస్యను ఎలా ఎంపిక చేసుకోవాలో, ప్రశ్నావళిని ఎలా రూపొందించుకోవాలో, సమాచారాన్ని ఎలా సేకరించాలో, ఎలా విశ్లేషించాలో, ప్రాజెక్టును ఎలా రాయాలో సవివరంగా తెలియజేశారు.

జైత్రిని ఘనంగా సత్కరిస్తున్న నగరాల కుల పెద్దలు

జైత్రికి ఘన సత్కారం

ప్రజాశక్తి -ములగాడ : సాంస్కృతిక పాటలలో ప్రతిభ చూపి ఢిల్లీలోని కృష్ణరంగ మహోత్సవంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ పాటల పోటీలకు హాజరై ద్వితీయ స్థానం సాధించిన జైత్రిని మల్కాపురం నగరాల సంఘ కుల పెద్దలు సత్కరించారు. మల్కాపురం నగరాల వీధికి చెందిన బంక శంకర్, దుర్గంబా కుమార్తె జైత్రి. మల్కాపురం జనతా కాలనీలో ఉన్న సాగర్ పబ్లిక్ స్కూల్లో 4వ తరగతి చదువుతోంది. ఈ కార్యక్రమంలో నగరాల కుల పెద్దలు ములంపాక అప్పారావు, మరుపిల్ల నూకరాజు, భోగవిల్లి నాగభూషణం, మజ్జి సోమేష్, మజ్జి వెంకటరమణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతమ్మధార జివిఎంసి 42వ వార్డులో అభివృద్ధి పనుల్లో భాగంగా రూ.1.50 లక్షల వ్యయంతో వార్డు కార్పొరేటర్ లీలావతి, మేయర్ హరి వెంకటకుమారి, ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జివిఎంసి పరిధిలో ఉన్న అన్ని వార్డులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కృష్ణ, ఆళ్ల శ్రీను, జివిఎంసి ఇంజినీర్ ఇ.శ్రీనివాసరావు, డిఇ భరణి కుమార్, ఎఇ అర్చన తదితరులు పాల్గొన్నారు

చెప్పల కోసం కొలతలు

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లి, గెద్దపేట గ్రామాల్లో ఉన్న 54 మంది కుష్టు, ఫైలేరియా రోగులకు చెప్పుల నిమిత్తం కొలతలు తీసే కార్యక్రమం చేపట్టారు. రెడ్డిపల్లిలో వైసిపి సీనియర్ నాయకులు సిరుగుడి ఆదినారాయణ, గెద్దపేటలో మాజీ ఎంపిటిసి కోడుర్రోతు శ్రీనివాసరావు సమక్షంలో కొలతలు తీసారు. కొలతలు తీసుకున్న వారికి ఈ నెల 30వ తేదీ నాటికి పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామని బిఫ్‌డిటి సంస్థ ప్రతినిధి గురునాథరెడ్డి తెలిపారు.

జగనన్న పాలనపై చర్చా వేదిక

ప్రజాశక్తి-పద్మనాభం : పద్మనాభం మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం జగనన్న పరిపాలనపై మేధావులు, వ్యాపారులతో చర్చా వేదిక కార్యక్రమాన్ని ఎంపిపి కె.రాంబాబు ఏర్పాటుచేశారు. నాయకులు, ఉద్యోగులు, మేధావులు, వ్యాపారులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రభుత్వం పరిపాలనపై చర్చించారు. పాలన ప్రారంభం నుంచి సంక్షేమ పథకాలు అమలు చేశారని, రోడ్ల అభివృద్ధి, పిఆర్‌సి వంటివి అమలు లేవని పేర్కొన్నారు. ఇచ్చిన హామీల్లో 95.5 శాతం వరకు అమలు జరిగిందన్నారు. ఈ కార్యక్రమములో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ పి.రాధ, రేవిడి పిహెచ్‌సి వైద్యాధికారి స్వప్న, ఉపాధ్యాయులు జగదీష్, అరుణ్‌కుమార్, శంకరరావు, చిరంజివి, నాయకులు ఆదిబాబు, ఈశ్వరరావు, సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నూతన వేతనాల అమలుకు ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్ కార్మికులకు తక్షణం నూతన వేతనాలు అమలుచేయాలని స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి రామస్వామి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. స్టీల్ సిఐటియు మిత్రపక్షాల ఆధ్వర్యాన ప్లాంట్‌లోని టి అండ్ డిసి కూడలి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ, వేతన ఒప్పందాలు జరుగుతాయనిస్టీల్ కార్మికులకు చాలా కాలంగా ఎదురు చూస్తున్నారని తెలిపారు. వేతన ఒప్పందం సెయిల్ కార్మికులకు అమలవుతోందని, విశాఖ ఉక్కు కార్మికులకు మాత్రం అమలు కాలేదని తెలిపారు. కార్మిక వర్గం ఐక్యంగా యాజమాన్య వైఖరికి వ్యతిరేకంగా ఉద్యమాలతో ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఈ ధర్నాలో స్టీల్ సిఐటియు నాయకులు ఎన్.రామారావు, పి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు, యు.వెంకటేశ్వర్లు, మరిడయ్య, నీలకంఠం, పుల్లారావు, వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న రామస్వామి

23న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-పెందుర్తి : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 23న కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో ఆరోగ్య శ్రీ పథకంలో ఎంపిక చేయబడిన స్టార్ పినాకిల్ హాస్పిటల్, జిజి హాస్పిటల్, బెహరా హాస్పిటల్, శంకర్ ఫౌండేషన్ హాస్పిటల్ వైద్య నిపుణులు ఎముకలు, కేన్సర్ కళ్ళు, సాధారణ వ్యాధులకుఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వ్యాధిగ్రస్తులు సద్వినియోగపరచుకోవాలని కోరారు.

ప్రజాధనం దుర్వినియోగం

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రజల సంక్షేమం గాలికి వదిలేసి ముఖ్యమంత్రి జగన్ పుట్టినరోజు వేడుకలకు ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని జనసేన పిఎసి సభ్యులు కొన తాతారావు విమర్శించారు. పౌర గ్రంథాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశంలో సంక్షేమ పథకాలను అమలు చేసిన సిఎం జగన్ అని వైసిపి నేతలు గొప్పలు చెబుతున్నారని, అయితే జగన్ సభలకు విద్యార్థులను, డ్వాక్రా మహిళలను, వాలంటీర్లను ఎందుకు తరలిస్తున్నారని ప్రశ్నించారు. వైసిపి పార్టీ హత్యలు, అవినీతికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారిపోయిందన్నారు. హత్య కేసులో జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చిన ఎమ్మెల్సీకి స్వాగతం పలకడం వైసిపి దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు. జనసేన భీమిలి ఇంచార్జ్ పంచకర్ల సందీప్ మాట్లాడుతూ అంబటి రాంబాబు అవినీతిని బయటపెట్టిన కుటుంబాన్ని బెదిరిస్తున్నారన్నారు.

ఉత్తరాంధ్ర వెనుకబాటుపై నివేదిక

అమర్‌నాథ్‌కు నివేదికను అందజేస్తున్న రామ్మోహనరావు

ప్రజాశక్తి - మాధవధార : అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం- ఉత్తరాంధ్ర వెనుకబాటుతనం-వాస్తవాలుపై నిర్వహించిన మేధావుల చర్చా వేదిక తీర్మానాలను నివేదిక రూపంలో రాష్ట్ర భారీ పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విశాఖ ఎంపీ ఎంవివి సత్యనారాయణకు అందించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర వెనుకబాటుతనానికి కారణాలు నేటి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, భవిష్యత్తులో ఉత్తరాంధ్ర అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర నివేదికను అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పప్పల రామ్మోహన్‌రావు నాయకత్వంలో అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం బృందం వారిని కలిసి సమగ్ర నివేదికను అందించారు. ఈ సమావేశంలో అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ సనపల రవీంద్ర భరత్ , స్టేట్ వైస్ ప్రెసిడెంట్ పి రమేష్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి వి.నాగకృష్ణారావు, పాతిన మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

సీతమ్మధారలో జన జాగృతి యాత్ర

ప్రజాశక్తి-మాధవధార : బడుగు బలహీన వర్గాల జన జాగృతి పాదయాత్ర ఆరవ రోజు సీతమ్మధారలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహాన్ని ఆకస్మికంగా సందర్శించింది. ఈ సందర్భంగా డాక్టర్ సనపల లక్ష్మీనరసింహ మాట్లాడుతూ, ఈ ప్రభుత్వాలు చెప్పే వాటికి వాస్తవానికి పొంతన లేనట్టుగా ఉందన్నారు. హాస్టల్లో విద్యార్థులు కడు దయనీయస్థితిలో ఉన్నారని రతెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివరంజని, 46వ వార్డు ప్రెసిడెంట్ కాశీబుగ్గ, యశ్వంత్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌ను సందర్శిస్తున్న లక్ష్మీ నరసింహ

చిట్లిపోయిన కాలుకు అరుదైన చికిత్స

ప్రజాశక్తి -గాజువాక : చిట్లిపోయిన కాలుకు కిమ్స్ ఐకాన్ హాస్పిటల్‌లో అరుదైన శస్త్ర చికిత్స చేశారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన బాలుడు నవీన్‌ను మినీ ట్రక్ ఢీకొంది. దీంతో ఎడమ కాలు తీవ్రంగా గాయపడింది. ఎముకలు బయటికి రావడంతో రక్తనాళాలు దెబ్బతిన్నాయి. ఎముక నలిగిపోవడం ఎదుర్కొన్నారు. డాక్టర్ పి.సిద్ధార్థ శ్రమించి ప్లాస్టిక్ సర్జరీ చేశారు. అతిక్లిష్టమైన ఆపరేషన్‌ను విజయవంతం చేసినట్లు కిమ్స్ వైద్యులు తెలిపారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు ఉధృతం

సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు మరింత ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా అధ్యక్షులు రుత్తల శంకరరావు తెలిపారు. ఈనెల 18, 19 తేదీల్లో పరవాడలో జరిగిన సిఐటియు అనకాపల్లి జిల్లా 12వ మహాసభలో నిర్ణయాలను మంగళవారం ఆయన విలేకర్లకు వెల్లడించారు. ఈ మహాసభల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై భవిష్యత్తు పోరాటాలకు పలు తీర్మానాలు చేసినట్లు చెప్పారు. రాబోయే మూడేళ్ల కాలంలో భవిష్యత్తు కర్తవ్యాలను నిర్దేశించుకున్నట్లు చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక ద్రోహులుగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వాలు ఈ విధానాలను వెనక్కు తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని, అందుకు కార్మికులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.

జిల్లా మహాసభలకు సహకరించిన వారికి ధన్యవాదాలు

పరవాడ : పరవాడలోని సీతారామ కళ్యాణ మండపంలో ఈ నెల 18, 19 తేదీల్లో జరిగిన సిఐటియు జిల్లా 12వ మహాసభను జయప్రదం చేసిన కార్మికులకు, ఉద్యోగులకు, సహకరించిన వ్యాపారులకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ ధన్యవాదాలు తెలియజేశారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ మహాసభలో పరిశ్రమల్లో స్థానిక నిర్వాసితులకు 75శాతం ఉపాధి కల్పించాలని, ఫార్మా, ఎస్ఈజెడ్ పరిశ్రమల్లో ప్రమాదాలను అరికట్టాలని, స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత రిటైర్మెంట్ బెనిఫిట్స్, కనీస వేతనాలు చేయాలని అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, రవాణా, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం చేయాలని, ఎన్టిపిసి ప్రత్యేక అలవెన్స్ సమస్య పరిష్కరించాలని, కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ ఉపసంహరించుకోవాలని, కాలుష్యం అరికట్టాలని, తాడి గ్రామాన్ని తరలించాలని, ఎస్ఈజెడ్, ఫార్మా పరిశ్రమల్లో కార్మిక చట్టాల అమలు చేయాలని, షెడ్యూల్ పరిశ్రమల్లో వేతనాలు సవరించాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని తదితర తీర్మానాలు ఆమోదించినట్లు తెలిపారు.

సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకరరావు, ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, కోశాధికారి శ్రీను

సిఐటియు నూతన జిల్లా కమిటీ ఎన్నిక

ఈ మహాసభలో 67 మందితో జిల్లా నూతన కార్యవర్గం, 16 మంది ఆఫీస్ బేరర్స్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు శంకరరావు తెలిపారు. సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రుత్తల శంకరరావు, జి.కోటేశ్వరరావు, కోశాధికారిగా వివి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా రొంగలి రాము, గనిశెట్టి సత్యనారాయణ, ఎం.నాగ శేషు, జి.దేవుడు నాయుడు, పిఎన్వి.పరమేశ్వరరావు, డి.సత్తిబాబు, సిహెచ్.రూపాదేవి, కె.త్రినాథరావు, కార్యదర్శులుగా ఎ.రాజు, వివి.సత్యవతి, జి.కుమారి, జి.వరలక్ష్మి, పి.చంద్రశేఖర్ ఎన్నికయ్యారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- సబ్బవరం : సబ్బవరం క్లస్టర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బంది, దళారుల బెడద లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మంచి మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. అనకాపల్లి జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహన్‌రావు మాట్లాడుతూ సాధారణ రకం ధాన్యం క్వింటాకు రూ.2040, గ్రేడ్- ఎ రకం క్వింటాకు రూ.2060 మద్దతు ధర ఇస్తున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లోనే రైతుల ఖాతాలో నేరుగా డబ్బులు జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రాప్‌లో నమోదైన రైతుల నుంచి మాత్రమే ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బోకం సూర్యకుమారి, జెడ్పీ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, పిఎసిఎస్ చైర్మన్ కాపుశెట్టి శేషుబాబు, వైస్ ఎంపిపిలు శరగడం రూప్నీ లక్ష్మీరాణి, చొక్కాకుల గోవింద్, మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, ఎంపిడిఓ రమేష్ నాయుడు, తహసీల్దార్ బి. సత్యనారాయణ, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ విరోతి చినఅప్పల నాయుడు, వైసిపి నాయకులు బోకం రామునాయుడు, కోటాన రాము, సబ్బవరపు నారాయణమూర్తి, మాజీ ఎంపిపి సబ్బవరపు ముత్యాల నాయుడు, పిఎసిఎస్ కార్యదర్శి జి.రమణ పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న నేవీ నిర్వాసితులు

ఢిల్లీ వెళ్లిన నేవీ నిర్వాసిత జెఎసి పెద్దలు

ప్రజాశక్తి-రాంబిల్లి

ఎన్ఎఓబి నిర్వాసితుల సమస్యలపై డిఫెన్స్ సెక్రెటరీని కలిసేందుకు నేవీ నిర్వాసిత జెఎసి పెద్దలు ఢిల్లీ వెళ్లారు. డిఫెన్స్ సెక్రెటరీ, నేవీ వైస్ అడ్మిరల్‌తో ఢిల్లీలో నేవీ నిర్వాసితుల సమస్యలపై చర్చలు జరుగుతాయని జెఎసి పెద్ద తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నేవీ మెయిన్ గేట్ ముందు ఎనిమిది గ్రామాల నేవీ నిర్వాసితులు చేపట్టిన ఆందోళన మంగళవారం నాటికి 51వ రోజుకు చేరింది. నేవీ మెయిన్ గేట్ ముందు వేలాదిమంది నిర్వాసితులు బైఠాయించి పెద్ద పెట్టున నినాదాలు చేశారు. 51 రోజులుగా ఆందోళన చేస్తున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంపై నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

తుమ్మపాల సుగర్స్ ఆస్తులు కాజేసేందుకు మంత్రి కుట్ర

ప్రజాశక్తి-అనకాపల్లి : తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ ఆస్తులను కాజేసేందుకు రాష్ట్ర పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్నాథ్ కుట్ర చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం 'ఇదే కర్మ మన బీసీలకు' పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి అమర్నాథ్ టిడిపిని విమర్శించడం మానుకొని నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు. బీసీలకు 10 శాతం రిజర్వేషన్లను తగ్గించిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మళ్ల సురేంద్ర, మాదంశెట్టి నీలబాబు, కర్రి వెంకట సన్యాసినాయుడు, అక్కిరెడ్డి రమణబాబు, పిట్ల రాజు, దాడి జగన్, ఎంఎస్ఎన్, సిద్దిరెడ్డి సూర్యానారాయణ పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా తదితరులు

విఎస్ఇజెడ్ జెడిసి కిరణ్‌బాబుకు ఘనంగా వీడ్కోలు

సత్కరించిన బ్రాండిక్స్ ఇండియా పార్టనర్ దొరస్వామి

వెంకటేశ్వరస్వామి చిత్ర పటాన్ని అందజేస్తున్న దొరస్వామి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

విశాఖపట్నం స్పెషల్ ఎకనమిక్ జోన్ (విఎస్ఇజెడ్) జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ వసంత కిరణ్‌బాబు బదిలీపై తన మాతృ సంస్థకు వెళ్తున్న సందర్భంగా ఆయనకు పారిశ్రామిక వేత్తలు, ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు. విశాఖలోని హోటల్ పామ్ బీచ్‌లో సోమవారం రాత్రి జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో వసంత కిరణ్‌బాబును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ ఇండియా భాగస్వామి దొరస్వామి జెడిసి కిరణ్‌బాబు దంపతులకు శాలువ కప్పి, పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి చిత్ర పటాన్ని బహూకరించి సన్మానించారు. 22వేల మంది బ్రాండిక్స్ ఉద్యోగుల తరుపున అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా దొరస్వామి మాట్లాడుతూ ఎప్పుడు ఏ అవసరం వచ్చినా, ఏ సమయంలోనైనా, ఫోన్ కాల్‌తో పరిశ్రమలకు సేవలు అందించడం ద్వారా ఆత్మీయ ఉద్యోగిగా అందరి మన్ననలు పొందారని తెలిపారు. హిమాచల్ ప్రదేశ్‌లోని మాతృ సంస్థకు వెళ్తున్న కిరణ్ బాబు భవిష్యత్ లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కస్టమ్స్ డిప్యూటీ కమిషనర్ ఎస్‌జెఎస్ హెచ్‌కె. వరప్రసాదవర్మ, జాయింట్ డిజిఎఫ్‌టి బిఎన్.రమేష్, జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఆర్ఎ.ప్రవీణ్ కుమార్, ఎపిఐపిడిసిఎల్ డైరెక్టర్ చంద్రం, పారిశ్రామిక వేత్తలు, విఎస్ఇజెడ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షునిగా భూలోక నాయుడు

ప్రజాశక్తి- కశింకోట : జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షునిగా మండలంలోని మోసయ్యపేట గ్రామానికి చెందిన వియ్యపు భూలోకనాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 18న సత్యనారాయణపురంలో జరిగిన యాదవ్ ఆత్మీయ కలయికలో ఈ ఎన్నిక జరిగింది. సమితి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ధూళి సూర్యచంద్ర, యువజన విభాగం జిల్లా అధ్యక్షునిగా దేవర అప్పారావు ఎన్నికయ్యారు. మిగతా కార్యవర్గాన్ని త్వరలో ప్రకటిస్తామని అధ్యక్షుడు భూలోకనాయడు తెలిపారు.

జాతీయ స్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి- దేవరాపల్లి

జాతీయస్థాయి టెన్నిస్, వాలీబాల్ పోటీలకు జిల్లాల్లోని పలు గురుకుల పాఠశాలల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల కర్నూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి టెన్నిస్, వాలీబాల్ పోటీల్లో తెనుగుపూడి గురుకులం నుంచి టి.అంజిత్, కోనాం నుంచి సిహెచ్.దివ్యవాణి, ధనజ శ్రీదుర్గ, టి.పిస్కిల్లా, తాళ్లపాలెం నుండి కె.కీర్తి, సబ్బవరం నుండి ఇద్దరు విద్యార్థులు ప్రతిభ కనబర్చి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులను గురుకులాల జిల్లా సమన్వయకర్త ఎస్.రూపవతి తెనుగుపూడి గురుకులంలో మంగళవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిహెచ్.రవీంద్రనాథ్, పిడిలు బి.రాంబాబు, సిఎల్ఎం.ప్రసాద్, ఎన్.సావిత్రి దేవి, వి.సూర్యనారాయణ, జి. తరునేశ్వరరావు, తల్లిదండ్రులకు కమిటీ చైర్మన్ ఉల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

సర్టిఫికెట్లు చూపుతున్న విద్యార్థులు

ఫలించిన హెరిటేజ్ డెయిరీ ప్రయోగం

ఆవుకు పుట్టిన ఆడ దూడ

ఆవుకు పుట్టిన ఆడ దూడ ఇదే..

ప్రజాశక్తి-అచ్యుతాపురం

హెరిటేజ్ డెయిరీ చేపట్టిన కృత్రిమ గర్భధారణ ద్వారా ఆవుకు ఆడపిల్ల పుట్టే ప్రయోగం ఫలించింది. మండలంలోని భోగాపురం గ్రామంలో హెరిటేజ్ డెయిరీ పాడి రైతు ధర్మరెడ్డి నాయుడు బాబుకు చెందిన ఆవుకి ఆడపెయ్య పుట్టుటకు కృత్రిమ గర్భధారణ చేశారు. శనివారం సాయంత్రం ఆవు ప్రసవించగా, ఆడ పెయ్య పుట్టింది. దీంతో పాడి రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హెరిటేజ్ డెయిరీ రీజనల్ మేనేజర్ పి.నాగ అప్పారావు గ్రామస్తులతో మాట్లాడుతూ హెరిటేజ్ అన్ని డెయిరీల కంటే పాలకు ఎక్కువ ధర చెల్లిస్తుందని చెప్పారు. హెరిటేజ్ డాక్టర్ బస్వన్ మాట్లాడుతూ హెరిటేజ్‌కు పాలు పోసిన రైతులకు ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు చెప్పారు. పాడి పశువులకు డి వార్మింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు, కె.అప్పారావు, ధర్మరెడ్డి అప్పల దొర, ధర్మరెడ్డి నాయుడు బాబు, ధర్మరెడ్డి అప్పలనాయుడు, కూండ్రపు తాతబాబు, పాడి రైతులు పాల్గొన్నారు.

లేహ్యం పంపిణీ చేస్తున్న ఆయుర్వేద వైద్యులు లావణ్య

విద్యార్థులకు ఆయుర్వేద లేహ్యం పంపిణీ

ప్రజాశక్తి - కశింకోట : కన్నూరుపాలెం ఆయుర్వేద వైద్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని సుందరయ్య పేట ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు ఆయుర్వేద లేహ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యాధికారి కోనాడ లావణ్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆరోగ్య సూత్రాలు పాటించాలని, భోజనం చేసే ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు బేగం, ఎఎన్ఎం రజనికుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

- డిసిఒ రూపవతి

ప్రజాశక్తి - దేవరాపల్లి : గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో 10వ తరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని గురుకులాల జిల్లా సమన్వయకర్త ఎస్. రూపవతి తెలిపారు. మంగళవారం మండలంలోని తెనుగుపూడి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలకు వచ్చిన ఆమె భోజన వసతి కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. తరగతి గదులను, వసతి గృహాలను పరిశీలించారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ, ఉమ్మడి విశాఖ జిల్లాలో 11గురుకులాల్లో 6,800 మంది విద్యార్థులు ఉన్నారని, ఈ ఏడాది 10వ తరగతి 870 మంది, ఇంటర్ పరీక్షలు 800 మంది విద్యార్థులు రాయనున్నారని తెలిపారు. 90 శాతం సిలబస్ కంప్లీట్ చేయడం జరిగిందని, ఎస్ఏ వన్ పరీక్షలు ఐదవ తరగతి నుంచి 10వ తరగతి వరకు జనవరిలో జరుగుతాయని తెలిపారు. వెనకబడిన విద్యార్థులకు మినీ స్టడీ మెటీరియల్స్ త్వరలోనే అందిస్తామన్నారు. కెవిఎల్‌వైఈఎస్ అమెరికాలో విద్యా అవకాశాల కోసం ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 25 మంది విద్యార్థులను ఎంపిక చేయగా, వారిలో జిల్లా నుంచి ఏడుగురు ఉన్నారని తెలిపారు. ఆమె వెంట ప్రిన్సిపల్ సిహెచ్.రవీంద్రనాథ్ తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఉల్లి శ్రీనివాసరావు ఉన్నారు.

ఘనంగా మోదకొండమ్మ జాతర

ప్రజాశక్తి - అనకాపల్లి : అనకాపల్లి కొట్నీ వీధి మోదకొండమ్మ అమ్మవారి జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. జాతరను పురస్కరించుకొని రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి పాదాలను తన శిరస్సుపై పెట్టుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. ఆలయ కమిటీ మంత్రిని ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు కోరుకొండ కాశి, వైసిపి నాయకులు మందపాటి జానకి రామరాజు, జాజుల రమేష్, కోరుకొండ రాఘవ పాల్గొన్నారు. మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ కూడా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఘటాలను పట్టుకొని పాదాల ఊరేగింపులో పాల్గొన్నారు. టిడిపి నాయకులు మళ్ల సురేంద్ర, పెనుమత్స సాయి రాజు, పచ్చి కూర రాము, వై రామకృష్ణ, తలారి లక్ష్మి ప్రసాద్, పొలిమేర ఆనంద్ పాల్గొన్నారు.

అమ్మవారి పాదాలు మోస్తున్న మంత్రి అమర్‌నాథ్

హడలెత్తిస్తున్న కోతులు

- తోటాడ రహదారిలో ప్రయాణానికి భయపడుతున్న జనం
- పంటలకూ నష్టం చేస్తున్నాయని రైతుల గగ్గోలు

రోడ్డుకు అడ్డంగా కోతులు ఉండడంతో నిలిచిపోయిన వాహనదారులు

ప్రజాశక్తి - మునగపాక రూరల్

మండల కేంద్రం మునగపాక నుండి తోటాడ వెళ్లే రహదారిలో కోతులు ప్రయాణికులను హడలెత్తిస్తున్నాయి. ఈ మార్గంలో తోటాడతో పాటు మూలపేట పాటిపల్లి, మంగళవారపేట గ్రామస్తులు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ మార్గంలో కోతులు గుంపులు గుంపులుగా సంచరిస్తూ ఏజెన్సీ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. మార్గమధ్యలో ప్రయాణికులను అటకాయిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. పొలాల్లోని కొబ్బరి, అరటి, బొప్పాయి, జామి వంటి ఫల వృక్షాలకు నష్టం వాటిల్లచేస్తున్నాయని స్థానిక రైతులు వాపోతున్నారు. ఒక్కోసారి ప్రయాణికులను బెదిరించి తిరగబడటంతో ఎక్కడ దాడి చేస్తాయని పలువురు ఆందోళన చెందుతున్నారు. పిల్లలు, వృద్ధులను వానరాలు మరింత భయపెడుతున్నాయని, తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి కోతుల నుండి రక్షణ కల్పించాలని రైతులు, ప్రయాణికులు కోరుతున్నారు.

గ్రామాల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - కె.కోటపాడు

మండలంలోని దాలివలస గ్రామంలో మంగళవారం ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రెండో రోజు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి రూ.3.50 కోట్లు వెచ్చించి పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రాథమికోన్నత పాఠశాలకు నాడు నేడు కింద రూ.24 లక్షల మంజూరు చేసామన్నారు. అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రెడ్డి జగన్మోహన్, జెడ్పిటిసి ఈర్లే అనురాధ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులతో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు

మునగపాక రూరల్ : మండలంలోని నాగవరం సచివాలయ పరిధి కుంచవానిపాలెం, అప్పికొండ వానిపాలెం, మల్లవరం గ్రామాలలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శాసనసభ్యులు యువి.రమణ మూర్తి రాజు, ఎలమంచిలి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు రొంగలి జగన్నాధరావు నిర్వహించారు. సంక్షేమ పథకాల అమలు తీరును ఆయా గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి పుట్టినరోజు సందర్భంగా కుంచవానిపాలెం రామాలయం వద్ద మొక్కలు నాటారు. 120 మంది నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ యు.సుకుమార్ వర్మ, జడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంపిపి మళ్ల జయలక్ష్మి, వైసిపి నాయకులు ఆడారి గణపతి అచ్చం నాయుడు, సీర రమణమ్మ, స్థానిక ఎంపిటిసి మరిసా రమణ, పాలి పిన్ని శ్రీనివాసరావు, స్థానిక సర్పంచ్ ఇందల హేమలత పాల్గొన్నారు.

వాట్సాప్ మెసేజ్‌కు స్పందించి..

రక్తదానం చేసిన యువకుడు

ప్రజాశక్తి - వద్దాది

కష్టాల్లో ఎవరైనా ఉంటే మనకెందుకులే అని అనుకునే ఈ రోజుల్లో..., ఆసుపత్రిలో అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగికి రక్తం అవసరమని వాట్సాప్‌లోని మెసేజ్ చూసి, స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేసి ఆ రోగికి ప్రాణదానం చేశాడు వద్దాది అమ్మ హెల్పింగ్ హార్ట్స్ సభ్యులు గోగుల వెంకటేష్. విశాఖకు చెందిన ఎం.సత్యవతి అనారోగ్యంతో వెంకోజిపాలెంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. శస్త్ర చికిత్సకు ఓ పాజిటివ్ బ్లడ్ లైవ్‌లో అవసరమైంది. అయితే ఆసుపత్రికి వచ్చి లైవ్‌లో రక్తదానం చేసే వారు రోగి బంధు మిత్రులలో లేకపోవడంతో సత్యవతి బంధువు మహేష్ వాట్సప్ గ్రూపులలో మెసేజ్ పెట్టాడు. దీంతో వద్దాదికి చెందిన వెంకటేష్ ఈ మెసేజ్ చూసి వెంటనే సంబంధిత ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేసి తాను రక్తదానానికి వస్తున్నానని చెప్పాడు. ఆయన విశాఖ ఆసుపత్రికి వెళ్లి రక్తదానం చేశాడు. సకాలంలో స్పందించి స్వచ్ఛందంగా ఆసుపత్రికి వెళ్లి రక్త దానం చేసిన వెంకటేష్‌కు సత్యవతి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



లైవ్‌లో రక్తదానం చేస్తున్న వెంకటేష్

రోడ్డును ఆక్రమించిన చేపట్టిన నిర్మాణాన్ని తొలగిస్తున్న దృశ్యం

అక్రమ నిర్మాణం తొలగింపు

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : మండల ప్రత్యేకాధికారి, డిపిఓ శిరీష రాణి ఆదేశాల మేరకు మండలంలోని చిట్టియపాలెంలో జగనన్న లేఔట్లో అంతర్గత రోడ్లలో ఆక్రమణలు మంగళవారం తొలగించారు. హౌసింగ్ కాలనీలో గ్రామానికి చెందిన అబద్ధం అనే వ్యక్తి రోడ్డుపై కొంత భాగాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేయడంతో, కాలనీ సందర్శనకు వచ్చిన డిపిఓకి స్థానిక సర్పంచ్ ఫిర్యాదు చేశారు. వెంటనే రోడ్డుని పరిశీలించి ఆక్రమణ తొలగించాలని స్థానిక అధికారులను ఆమె ఆదేశించారు. దీంతో హౌసింగ్, సచివాలయ సిబ్బంది ఆక్రమణలు తొలగించి రోడ్డును పునరుద్ధరించారు.

ప్రజాధనంతో సిఎం జన్మదిన వేడుకలు సిగ్గుచేటు

ప్రజాశక్తి - అనకాపల్లి : ప్రజాధనంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించడం సిగ్గుచేటని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అప్పులు తెస్తేగాని ఉద్యోగులకు పింఛన్లు, జీతాలు ఇవ్వలేని పరిస్థితుల్లో రాష్ట్ర ఖజానా ఉండగా, సిఎం జన్మదిన వేడుకలకు రాష్ట్ర ఖజానా నుంచి రూ.2.50 కోట్లు ఖర్చు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్థానిక ప్రసిద్ధ బౌద్ధ ఆరామ క్షేత్రం బొజ్జన్న కొండను అభివృద్ధి చేయలేని స్థితిలో రాష్ట్ర సాంస్కృతిక పర్యాటక శాఖ ఉందని ఎద్దేవా చేశారు. కనీసం రోడ్డు, విద్యుత్తు సౌకర్యం కల్పించలేని పరిస్థితి ఉందన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

ప్రజాశక్తి - అనకాపల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని, ఇటీవల తుఫానులో తడిచి రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని సిపిఐ నాయకులు వైఎన్ భద్రం, కె.శంకర్రావు, శ్రీరామదాసు అబ్బులు డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టిన రైతాంగానికి పంట చేతికి వస్తుందన్న సమయంలో తుఫాను వల్ల తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంతో పాటు పంట నష్టపరిహారం కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు చెల్లూరి నాగరాజు, మత్తుర్తి సూరి బాబు పాల్గొన్నారు.

రహదారుల దుస్థితిపై నిరసన

ప్రజాశక్తి - అనకాపల్లి : అనకాపల్లి రహదారుల దుస్థితిపై పాలకులు దృష్టి సారించాలని బీఎస్పీ నాయకులు సూదికొండ మాణిక్యాలరావు కోరారు. స్థానిక రైల్వే స్టేషన్ గూడ్స్ రోడ్‌లో శిథిలమైన రోడ్డు వద్ద కళ్లకు నల్ల రిబ్బన్ ధరించి ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం వేలాదిమంది ప్రయాణిస్తుండే రైల్వే స్టేషన్ రోడ్డు ముడుకు లోతు గోతులతో ఉందని తెలిపారు. ఇప్పటికైనా పాలకులు కళ్ళు తెరిచి రహదారుల మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

నేడు వద్దాదిలో మెగా రక్తదాన శిబిరం

వద్దాది : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 50వ జన్మదిన సందర్భంగా వద్దాది కోవెల అప్పన్న దొర జెడ్పీ హైస్కూల్లో బుధవారం ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని వైస్ ఎంపిపి దొండా లలితా నారాయణమూర్తి తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను వద్దాది పంచాయతీ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం జూనియర్ కాలేజీ, కెజిబివి, హైస్కూల్, పంచాయతీ కార్యాలయంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొల్లిమల్ల అచ్చం నాయుడు, దాకవరపు నాగేశ్వరరావు కోవెల జనార్దన్ రావు, దొండా నారాయణమూర్తి, దొండా సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరం బేనర్‌ను ఆవిష్కరిస్తున్న వైస్ ఎంపిపి తదితరులు

సిఎం జగన్ పుట్టినరోజు సందర్భంగా పలుచోట్ల మొక్కల నాటివేత

నర్సీపట్నంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : జగనన్న పచ్చ తోరణంలో భాగంగా ముఖ్యమంత్రి జగన్ పుట్టిన రోజు సందర్భంగా ఎపి రెసిడెన్షియల్ పాఠశాలలో అటవీశాఖ అధికారులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ 150 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 21న బుధవారం నిర్వహించే రక్తదాన శిబిరంలో నియోజకవర్గంలోని ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈనెల 28న ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి పలు శంకుస్థాపన చేస్తారని, అందులో భాగంగా మాకవరపాలెంలో రూ.500 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న మెడికల్ కళాశాలకు సీఎం జగన్ శంకుస్థాపన చేస్తారన్నారు. అలాగే తాండవ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేస్తారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నర్సీపట్నం అటవీశాఖ డిఎఫ్ఒ బి రాజారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జి ఆదిలక్ష్మి, వైస్‌చైర్మన్ తమరాన అప్పలనాయుడు, ఎఫ్ఆర్ఒలు పి లక్ష్మీనర్స్, సుబ్బారావు, ఎఫ్ఎస్ఒలు భాగ్యలక్ష్మి, కె వి రమణ, కౌన్సిలర్ బోడపాటి సుబ్బలక్ష్మి, పాఠశాల హెడ్‌మాస్టర్ దేవా సాల్మన్ బాబు పాల్గొన్నారు.

గొలుగొండ : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో జగనన్న పచ్చతోరణం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎంపిపి గజ్జలపు మణికుమారి, వైసిపి మండలాధ్యక్షులు లెక్కల సత్యనారాయణ అధ్యక్షతన మొక్కలు నాటారు..కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులు, నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోలుగుంట : జగనన్న పచ్చ తోరణంలో భాగంగా ముఖ్యమంత్రి .జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మంగళవారం రోలుగుంట ప్రాథమిక కేంద్రంలో చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా సుమారు 200 మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు మడ్డు అప్పలనాయుడు, జడ్పిటిసి పోతన లక్ష్మీ శ్రీనివాస్, ఎంపిడిఒ ప్రభాకర్‌రావు, తహశీల్దార్ వెంకటేశ్వరరావు, ఎస్సై నాగకార్తీక్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్, తోటి సిబ్బంది, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపిటిసిలు, జెడ్పీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అనకాపల్లి : ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో మంగళవారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పలక యశోద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా మొక్కలు నాటడం, రక్తదాన శిబిరాలు వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నల్ల బెల్లం విక్రయ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ఎంపీ సత్యవతి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి దిలీప్ కుమార్ మాట్లాడారు. అనంతరం కేక్ కట్ చేసి కార్మికులకు యూనిఫారాలు పంపిణీ చేశారు.ఎంపీపీ గొర్లి సూరిబాబు, కసింకోట జడ్పిటిసి దంతులూరి శ్రీధర్ రాజు, వైసిపి నాయకులు పలక రవి, మళ్ల బుల్లిబాబు, జాజుల రమేష్, బొడ్డేడ శివ, కర్రి సన్యాసినాయుడు పాల్గొన్నారు.

రోలుగుంటలో మొక్కలు నాటుతున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

అనకాపల్లిలో చీరలు పంపిణీ చేస్తున్న మంత్రి అమర్‌నాథ్

చోడవరం : స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల వద్ద ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మంగళవారం మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం చోడవరంలో షెటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, వైస్ ఎంపీపీ బైన కుమారి ఈశ్వరరావు, గాంధీ గ్రామ సర్పంచ్ గాడి అప్పారావు, వైసిపి నేతలు ఏడవక సత్యారావు, దేవరపల్లి సత్య, భవాని, శ్యామల పాల్గొన్నారు.

కశింకోట : కాలుష్య నివారణకు మొక్కలు నాటాలని ఎమ్‌పిపి కలగా లక్ష్మి అన్నారు. మండలంలోని ఉగ్గినపాలెంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు పాల్గొన్నారు. తునిలో సర్పంచ్ కొన అరుణ, నాగేశ్వరరావు, తాళ్ళపాలెంలో ఎంపిటిసి లగిశెట్టి భవానీ గణేష్, పరవాడపాలెంలో సర్పంచ్ బలిజ మంగ ముసలి నాయుడు, త్యేగాడలో ఎమ్‌పిడిఓ కొంకి అప్పారావు, ఎన్‌జి పాలెంలో సర్పంచ్ కలిగట్ల నూకరత్నం ఆధ్వర్యాన మొక్కలు నాటారు.

పరవాడ : పరవాడ జగనన్న హౌసింగ్ కాలనీలో ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మి శ్రీనివాస్ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. పరవాడ మండలంలో 5000 మొక్కలు నాటడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని వెల్లడించారు. జడ్పిటిసి పిఎస్ రాజు, పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, ఎంపీడీవో హేమ సుందరరావు, ఇఒపిఆర్‌డి పద్మజ, వైసిపి నాయకులు కోన రాము, ఏపీవో భాగ్యలక్ష్మి, రెడ్డి శ్రీనివాసరావు, అచ్చుతరావు పాల్గొన్నారు.

ఇంధన పొదుపుపై అవగాహన ర్యాలీ

ర్యాలీ చేస్తున్న విద్యుత్ సిబ్బంది, తదితరులు

ప్రజాశక్తి -మాకవరపాలెం: జాతీయ ఇంధన పొదుపువారోత్సవాల్లో భాగంగా మాకవరపాలెంలో విద్యుత్ శాఖ అధికారులు ర్యాలీ నిర్వహించారుజ ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ డిఒ సురేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను ఆదా చేయాలన్నారు. ఒక యూనిట్ విద్యుత్తు పొదుపు, రెండు యూనిట్లు ఉత్పత్తికి సమానమని ప్రజలంతా గమనంలో పెట్టుకుని, భావితరాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని వ్యవహరించాలని కోరారు.

నినాదాలు చేస్తూ మాకవరపాలెం బస్టాండ్ వరకు విద్యుత్ శాఖ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు అనంతరం విద్యుత్ పొదుపుపై షాపులకు పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలకృష్ణ, స్థానిక విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తున్న సర్పంచ్ రఘురామ్

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని సిహెచ్.నాగాపురం పంచాయతీలో రైతుభరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కార్యక్రమాన్ని సర్పంచ్ యలమంచిలి రఘురామ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు ఎంతో లాభసాటిగా ఉంటాయని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు దళారుల బారిన పడకుండా, తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి, నిబంధనల మేరకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మండల అగ్రికల్చర్ ఆఫీసర్, అగ్రికల్చర్ అసిస్టెంట్స్, గ్రామ సర్పంచ్ రఘురాం, రైతులు పాల్గొన్నారు.

వికలాంగులకు వీల్‌చైర్లు పంపిణీ

వీల్‌చైర్లు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న తహశీల్దార్

ప్రజాశక్తి -కోటవురట్ల : మండల కేంద్రంలో సీఫా సంస్థ ఆధ్వర్యంలో మేము సైతం మండల వికలాంగుల సమాఖ్య సౌజన్యంతో వికలాంగులకు మంగళవారం వీల్‌చైర్లు, దుప్పట్లను తహశీల్దార్ జానకమ్మ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ జానకమ్మ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వికలాంగులకు భోజన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో సీఫా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు,

గాయపడిన యువకుడు మృతి

ప్రజాశక్తి-కొత్తకోట : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు విశాఖ కెజిహెచ్ లో మంగళవారం మృతి చెందాడు. కొత్తకోట గ్రామానికి చెందిన కందికొండ అజయ్ (20) ఈ నెల 16న తన స్నేహితునితో నర్సీపట్నం నుంచి కొత్తకోట వైపు బైక్‌పై వస్తుండగా కంచుగుమ్మల గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను బలంగా ఢీకొంది. ఈ సంఘటనలో అజయ్‌కు తలపై తీవ్ర గాయం కాగా నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖ కెజిహెచ్‌కు మెరుగైన వైద్య సేవలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డాడు. ఈ ప్రమాదంలో మరో యువకుడు పి. దుర్గాప్రసాద్ స్వల్ప గాయాలతో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి -నక్కపల్లి : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు పురస్కరించుకుని రెండవ రోజు మంగళవారం నక్కపల్లిలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు ఎంతో ఉత్సాహంతో ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పార్టీ నాయకులతో కలిసి ముగ్గుల పోటీలను పరిశీలించారు. వైసిపి నాయకులు శీరం నరసింహమూర్తి, బొల్లం బాబ్జీ, సూరకాసుల గోవింద్, ఎలమంచిలి తాతబాబు, జనపరెడ్డి శేషారత్నం, గురునాథరావు ఈశ్వరరావు పాల్గొన్నారు

పాయకరావుపేట : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకల్లో భాగంగా రెండవ రోజు స్థానిక మండల పరిషత్ కాంప్లెక్స్ ఆవరణలో మహిళలు ముగ్గులు పోటీలు, కుర్చీలాట పోటీలు మంగళవారం నిర్వహించారు. పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పాల్గొని పరిశీలించారు. విజేతలకు ఈనెల 21న బహుమతులు అందజేస్తామన్నారు. అనంతరం కేక్ కటింగ్ చేసి స్వీట్లు మహిళలకు కార్యకర్తలకు నాయకులకు పంచిపెట్టారు బుధవారం ముఖ్యమంత్రి పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు ట్యాబులు పంపిణీ, అన్నసమారాధన, పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే బాబూరావు అన్నారు కార్యక్రమంలో వ్యవసాయ సలహామండలి జిల్లా చైర్మన్ చిక్కాల రామారావు, జెడ్‌పిటిసి లంక సూర్యనారాయణ, వైసిపి మండల అధ్యక్షుడు దనిశెట్టి బాబూరావు, పాయకరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గూటూరు శ్రీనివాసరావు, ఇసారపు తాతారావు, దగ్గుపల్లి సాయిబాబా, జగతా శ్రీను, కేసనకుర్తి సత్తిబాబు, ఎంపిడిఒ ఎ సాంబశివరావు, సిహెచ్ చంద్రశేఖరరావు డ్వాక్రా మహిళలు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు


ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

కోటవురట్లలో ముగ్గులను పరిశీలిస్తున్న వైస్ ఎంపిపి, తహశీల్దార్

కోటవురట్ల: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి 50వ జన్మదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో వెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి 40 మంది పోటీల్లో పాల్గొన్నారు. వైస్ ఎంపిపి చెక్క సుజాత, తహశీల్దార్ జానకమ్మ మహిళలు వేసిన ముగ్గులను పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. విజేతలకు బుధవారం ఎమ్మెల్యే గొల్ల బాబూరావు బహుమతులను అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో దత్తుడు రాజు, స్థానిక సర్పంచ్ అనిల్‌కుమార్, ఇఒపిఆర్‌డి ప్రేమ్‌సాగర్, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సత్యశ్రీ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

మైక్‌సెట్ వితరణ

ప్రజాశక్తి - రావికమతం : మండలంలోని గుడ్డిప విశాఖ డెయిరీ పాలకేంద్రం వద్ద నిర్మించిన అభయాంజనేయ స్వామికి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ దుప్పట్ల బాల రాజు కుమారుడు దుప్పట్ల చక్రి రూ.15వేలు విలువైన మైక్‌సెట్‌ను ఆలయ కమిటీ సభ్యులైన గల్లా వెంకటరమణకు అందజేశారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం వేళల్లో భజన, సుప్రభాత గీతాలు మొదలగు కార్యక్రమాల నిర్వహణకు మైక్‌సెట్ అవసరాన్ని గుర్తించి వితరణగా అందజేసినట్లు దాత చక్రి తెలిపారు. దాత చక్రిని అభయ ఆంజనేయ స్వామి కమిటీ, గ్రామ ప్రజలు అభినందించారు.

మైక్‌సెట్ అందజేస్తున్న దాత చక్రి

8న డాగ్ షో

బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మేయర్ వెంకటకుమారి, కెకె.రాజు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ కెనైన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనవరి 8న తలపెట్టిన డాగ్ షో బ్రోచర్‌ను మంగళవారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నెడ్ క్యాప్ ఛైర్మన్ కెకె.రాజుతో కలిసి నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరి 8 న ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అన్ని రకాల పెట్, డాగ్‌లతో కూడిన షో ఎంవిపి కాలనీ ఆళ్వార్‌దాస్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మానవ జీవితాల్లో కుటుంబ సభ్యులుగా శునకాలు కనిపించడం పరిపాటి అన్నారు. ల్యాబ్రాడర్ రిట్రైవర్, గోల్డెన్ రిట్రైవర్, జర్మన్ షెపర్డ్, గ్రేట్ డేన్, డాబర్ మెన్, డాల్మేషన్, సెయింట్ బెర్నార్డ్, బాక్సర్, సైబీరియన్ హస్కీ, ఫ్రెంచ్ బుల్ డాగ్ తదితర వంద రకాల డాగ్స్ ఈ ప్రదర్శనలో పాల్గొంటాయని తెలిపారు. కార్యక్రమంలో డాగ్‌షో నిర్వాహకులు బాబు, పెట్ యజమానులు పాల్గొన్నారు.

జాతీయ బాక్సింగ్ పోటీలకు కృష్ణవేణి

కృష్ణవేణి

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్ : ఈ నెల 21 నుండి 26 వరకు మధ్యప్రదేశ్ భోపాల్‌లో జరుగనున్న ఆరవ సీనియర్ నేషనల్ బాక్సింగ్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ టీం తరపున నర్సీపట్నం బాక్సర్ కృష్ణవేణి 57 కిలోల విభాగం సీనియర్ ఉమెన్ కేటగిరిలో పాల్గొంటారని కోచ్ తెలిపారు. గత నెలలో విజయనగరంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన కృష్ణవేణి, జాతీయ పోటీలకు అర్హత సాధించారని తెలిపారు. ఈమేరకు కృష్ణవేణి నింజాస్ అకాడమీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్, కోచ్ అభినందించారు.

సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న రఘురామ్

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని సిహెచ్.నాగాపురం పంచాయతీ శివారు గ్రామమైన పల్లాడురులో రూ.20లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ యలమంచిలి రఘురామ్ ప్రారంభించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ పర్యటించినప్పుడు సిసి రోడ్డు నిర్మాణం కోసం స్థానికులు విజ్ఞప్తి చేయగా, ఎమ్మెల్యే స్పందించి రూ.20లక్షల గ్రాంట్ విడుదల చేశారు. దీంతో మంగళవారం ఈ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే గణేష్‌కు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాసిల బాలసుబ్రమణ్యం, పల్లా చిన్నబ్బాయి, గంట్ల బుచ్చిబాబు, దివాణం పాల్గొన్నారు.

బాల ప్రవీణ్‌కు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలి

ఎడిసికి వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నేత కుమార్, బాధిత కుటుంబసభ్యులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసి జోన్ 2లో డంపింగ్ యార్డ్ వద్ద పందులను కాల్చి చంపే క్రమంలో తూటా గోళీలు తగిలి గాయపడ్డ బాల ప్రవీణ్‌కు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలంటూ మంగళవారం సాయంత్రం ఎడిసి సన్యాసిరావుకు సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, బాధితుని కుటుంబ సభ్యులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే బాధితున్ని మూడు ఆసుపత్రులు మార్చి, కెజిహెచ్‌లో జాయిన్ చేశామని, ఇప్పటికీ శరీరంలో ఉన్న గోళీలు తీయలేకపోయారని తెలిపారు. కార్మికునికి మెరుగైన చికిత్స చేయించే బాధ్యత జివిఎంసిదేనని అన్నారు. బాధితుని కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఎంహెచ్ఓ శాస్త్రి, ఎడిసి వివిఎస్.రావు మెరుగైన వైద్యం అందించే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో సిఐటియు నాయకులు డి.అప్పలరాజు, పి.రాజ్ కుమార్, జి.కిరణ్ ఉన్నారు.

ఘనంగా సిపిఐ ఆవిర్భావ దినోత్సవం

పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న సిపిఐ నేతలు

ప్రజాశక్తి-గొలుగొండ : సిపిఐ 98వ ఆవిర్భావ దినోత్సవాలు ఘనంగా నిర్వహించుకోవాలని ఆపార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని యర్రవరం, చీడిగుమ్మల అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద సిపిఐ ఆవిర్భావ దినోత్సవాలు సందర్భంగా సిపిఐ సీనియర్ నాయకులు దాకారపు దేముడు పతాక ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా రామునాయుడు మాట్లాడుతూ, స్వాతంత్ర్యానికి పూర్వమే 1925లో ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ పేదల పక్షాన ఉంటూ, కష్టజీవులు కోసం నిరంతరం పోరాటాలు చేస్తూ మహిళలకు సామాజిక సమానత్వం, దేశంలో ప్రతి పౌరుడు స్వేచ్ఛ సమానత్వం కలిగి ఉండాలని పోరాటం చేస్తూనే ఉంటున్నారు. ఈ నెల 20 నుంచి 26 వరకు నిర్వహించే వారోత్సవాలలో భాగంగా చీడిగుమ్మల, ఎర్రవరంలో సిపిఐ 98 వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సిపిఐ కార్యవర్గ సభ్యులు జి.రాధాకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు కిల్లాడ అప్పలనాయుడు, రైతు సంఘం మండల నాయకులు మర్రి అప్పలనాయుడు, ప్రజానాట్యమండలి మాజీ నాయకులు శెట్టి సత్తిబాబు, లెక్కల రాజు, కామిరెడ్డి రాజు, శాఖ సభ్యులు పాల్గొన్నారు.

ఏలేరు భూముల దురాక్రమణపై సర్వే

సర్వే చేస్తున్న రెవెన్యూ యంత్రాంగం

ప్రజాశక్తి -మాకవరపాలెం: దుంగలవాని పాలెం గ్రామంలో ఏలేరు భూముల ఆక్రమణపై మంగళవారం ఏలేరు నీటిపారుదల శాఖ, రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. దుంగలవానిపాలెం గ్రామంలో ఏలేరు భూములు ఆక్రమణకు గురయ్యాయని, సర్వే చేసి వాటిని పరిరక్షించాలని రెవెన్యూ అధికారులకు సంబంధిత డిఇ వసంత ఫిర్యాదు చేయడంతో మంగళవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఏలేరు భూమికి ఆనుకొని ప్రైవేటు భూములు ఉన్నాయని, అయితే ఏలేరు గట్టులో కొంత కొంత భూమి ప్రైవేటు వ్యక్తులది చెప్పడంతో సర్వే చేస్తున్నట్లు తెలిపారు సర్వే పూర్తయిన తర్వాత ఆక్రమణలను గుర్తించి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామనానరు. కార్యక్రమంలో సర్వేయర్ గోపాలకృష్ణ ఏలేరు సిబ్బంది పాల్గొన్నారు

ఆసుపత్రిలో రోగులకు భోజనాలు పెట్టండి



ఎమ్మెల్యే బాబూరావు కు వినతి పత్రం అందజేస్తున్న అప్పలరాజు

ప్రజాశక్తి -నక్కపల్లి : నక్కపల్లి ప్రభుత్వ 50 పడకల ఆసుపత్రిలో రోగులకు భోజనాలు పెట్టాలని కోరుతూ ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు మంగళవారం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు వినతిపత్రం అందజేశారు. స్థానిక ఆసుపత్రిలో గత రెండేళ్లుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో భోజనాలు పెట్టలేదని, దీని కారణంగా రోగులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే తగు చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే బాబూరావు స్పందించి వెంటనే ఆసుపత్రిలో రోగులకు భోజనాలు పెట్టేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జనార్ధన్‌కు ఆదేశించారు.. త్వరలోనే రోగులకు భోజనాలు పెడతామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జనార్ధన్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పిక్కి రాజు, తుంపాల మణికంఠ, తాతాజీ పాల్గొన్నారు.

అవినీతికి చిరునామాగా 'స్థాయీ సంఘం'

ప్రజాశక్తి - సీతమ్మధార : పలు పనుల అంచనాలు పెంచి, ఇష్టానుసార ఆమోదాలతో కోట్లాది రూపాయలు దోచుకోవడానికి జివిఎంసి స్థాయీ సంఘం సభ్యులు సిద్ధమయ్యారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జివిఎంసి స్థాయీ సంఘం అవినీతి, అక్రమాలకు చిరునామాగా మారిందన్నారు. అనుమతి లేకుండా రెట్టింపు మొత్తానికి కొన్న వైర్‌లెస్ సెట్లు, జగనన్న ఇళ్ల స్థలాల సాఫ్ట్‌వేర్ రూపకల్పన, చెత్త తొలగింపు వాహనాల కొనుగోలు వంటి విషయాల్లో అవినీతి వెల్లడవుతోందన్నారు

భారత నౌకాదళంలోకి 'వగీర్'

సముద్ర జలాల్లో 'వగీర్' జలాంతర్గామి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రాజెక్ట్ - 75 ఐదో జలాంతర్గామి కల్వరి క్లాస్ సబ్‌మెరైన్ యార్డ్ 11879 'వగీర్'ను మంగళవారం భారత నావికాదళానికి అందజేశారు. స్కార్పెన్ డిజైన్‌తో కూడిన ఆరు జలాంతర్గాముల స్వదేశీ నిర్మాణంలో భాగంగా జలాంతర్గాములు ముంబయిలో నావల్ గ్రూప్ మజాగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్, ఫ్రాన్స్ సహకారంతో నిర్మితమవుతున్నాయి. వగీర్ నిర్మాణం 2020లో ప్రారంభమైంది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి సీ ట్రయల్స్ నిర్వహించారు. 24 నెలల వ్యవధిలో భారత నౌకాదళానికి అందజేసిన మూడో జలాంతర్గామి ఇదని నౌకాదళాధికారులు తెలిపారు.

సౌత్‌ఇండియా ఛాంపియన్ షిప్ పోటీలకు

నర్సీపట్నం బాడీ బిల్డర్లు

సౌత్‌ఇండియా పోటీలకు ఎంపికైన రామ్, ప్రతీక్

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్ : ఇండియన్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా ఫస్ట్ మిస్టర్ ఇండియా బాడీ బిల్డింగ్ ఛాంపియన్ షిప్- 2022 పోటీలు ఈ నెల 18న తిరుపతిలోని ఎస్‌వీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించారు. ఈ పోటీలలో నర్సీపట్నంలోని జివిఆర్ జిమ్ కోచ్ గొలుసు పురుషోత్తం ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న ఎం.రామ్ 55 కేజీల విభాగంలో రెండవ బహుమతి, ఎస్.ప్రతీక్ మూడవ బహుమతి గెలుపొందారు. వీరు జనవరి 8న చెన్నైలో జరుగు సౌత్ ఇండియా పోటీలకు ఎంపికయ్యారు. వీరిని నర్సీపట్నంలో పలువురు ప్రముఖులు అభినందించారు. చెన్నైలో జరుగు పోటీలో గెలుపొందాలని ఆకాంక్షించారు.

నేడు భూ రీసర్వే పట్టాల పంపిణీ

ప్రజాశక్తి- చీడికాడ : జగనన్న భూ రీసర్వే పూర్తయిన భూములకు ఈ నెల 21న బుధవారం పట్టాలు పంపిణీ చేయనున్నట్లు విఆర్ఓ కొండలరావు తెలిపారు. మండలంలోని ఎల్‌బి..పట్నం గ్రామంలో జగనన్న భూ రీసర్వే ఇప్పటికే సర్వే పూర్తయిందన్నారు. అందరు రైతులు, గ్రామస్తుల సహకారంతో సర్వే విజయవంతంగా పూర్తయిందని, ఎంపీపీ కొరత జయమ్మ నారాయణమూర్తి, జెడ్‌పిటిసి లాలం శారద వరలక్ష్మి జానకిరామ్ బుధవారం రైతులకు పట్టాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.